Follow: @ANNTELUGU
30-04-2026
ANN తెలుగు
# మహా పత్రిక
గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 123 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## మే 10న జనాగ్రహ సభకు మోదీ
### సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహణ

మహిళా వ్యతిరేక పార్టీలకు బుద్ధి చెప్పేందుకే సభ

పోస్టర్ ఆవిష్కరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

**హైదరాబాద్, మహా:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మే 10వ తేదీన తెలంగాణ రాష్ట్ర పర్యటనకు విచ్చేయనున్నారు. మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన తొలిసారిగా పర్యటనలో భాగంగా హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం సుమారు రూ. 7,700 కోట్ల నుండి రూ. 8,000 కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు నారపరాజు రామచంద్రరావు తెలియజేశారు. ప్రధాని పర్యటన సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు 'జన ఆగ్రహ సభ' అని నామకరణం చేశారు. ఈ సభకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ పర్యటనను చారిత్రాత్మక విజయవంతం చేసేందుకు పార్టీ

మిగతా 2లో

టాప్ న్యూస్

### కేసీఆర్ లేకుంటే కవిత ఎవరు?



- తండ్రికి విలువ ఇవ్వని కవిత ప్రజలకేం మేలు చేస్తారు
- కవిత పార్టీపై ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి విమర్శలు
- పార్టీ పెట్టడమంటే పాన్ షాప్ పెట్టినంత ఈజీ కాదు

02

### నేను మంత్రి పదవి అడగలేదు



- మా నేతలకు నామినేటెడ్ పోస్టులు ఇస్తారని ఆశిస్తున్నా...
- ఎమ్మెల్సీ కోదండరాం

02

### తెలంగాణలో చమురు కొరత లేదు



- రికార్డు స్థాయిలో పెట్రోల్ సరఫరా
- సోషల్ మీడియా పుకార్లను నమ్మవద్దని విజ్ఞప్తి
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టీకరణ

02

# బెంగాల్.. తమిళనాడులో హోరాహోరీ

## మమత వైపు కొన్ని.. కమలం గెలుస్తుందని మరికొన్ని

కేరళంలో యూడీఎఫ్.. మార్పు తథ్యం

తమిళనాడులో డీఎంకేకు టెన్షన్

అస్సాం..పుదుచ్చేరిపై అందరిదీ ఒకేమాట

ఎగ్జిట్ పోల్స్ అంచనాలు.. మే 4న అసలు ఫలితం

(మహా నెట్ వర్క్ )

పశ్చిమబెంగాల్ ప్రజలు మార్పు కోరుతూ ఓటేశారా? టీఎంసీ హవాకు ఈసారి గండి పడి, బీజేపీ విజయం సాధించనుందా? పలు ఎగ్జిట్ పోల్స్ అవుననే చెబుతున్నాయి. చాణక్య స్ట్రాటజీస్, మ్యాట్రిజ్, ప్రజాపోల్, పోల్ డైరీ వంటి ఎగ్జిట్ పోల్స్ బీజేపీకి పట్టం కట్టాయి. పీపుల్స్ పల్స్, జన్‌మత్ పోల్స్, బీకాన్ ఆర్గనైజేషన్ వంటి సంస్థలు టీఎంసీ విజయం సాధిస్తుందని జోస్యం చెప్పాయి. నువ్వానేనా అన్నిరీతిలో టీఎంసీబీజేపీ మధ్య పోటీ ఉందని జేవీసీ ఎగ్జిట్ పోల్ అంచనా వేసింది. బెంగాల్ లో చాణక్య స్ట్రాటజీస్ ప్రకారం బంగాల్‌లో ఈసారి బీజేపీకి 150160 సీట్లు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇక టీఎంసీకి 130140 సీట్లు రావచ్చని అంచనా వేసింది. ఇతరత్రా పార్టీలకు 6 నుంచి 10 సీట్లు వచ్చే ఛాన్స్ ఉందని పేర్కొంది. పీపుల్స్ పల్స్ సంస్థ మాత్రం ఇందుకు భిన్నంగా మమతా బెనర్జీ సారథ్యంలోని టీఎంసీయే క్లీన్ స్వీప్ చేస్తుందని ప్రకటించింది. టీఎంసీకి 177187, బీజేపీకి 95 110 సీట్లు రావచ్చని అంచనా వేసింది. కొన్ని టీవీ ఛానళ్లు టీఎంసీకి అనుకూలంగా, ఇంకొన్ని బీజేపీకి అనుకూలంగా ఎగ్జిట్ పోల్స్‌ను విడుదల చేశాయి. మొత్తం మీద సింహభాగం ఎగ్జిట్ పోల్స్ బెంగాల్‌లో బీజేపీకే అడ్వాంటేజీ ఉందని వెల్లడించాయి.

మిగతా 2లో




### తమిళనాడు సీఎం విజయ్?
ప్రభంజనం ఖాయమంటున్న యాక్సిస్ మై ఇండియా

**చెన్నై, మహా:** తమిళనాడు సీఎంగా విజయ్ పట్టాభిషేకం చేయడం ఖాయమని పలు సర్వేలు ట్రెండ్స్ చెబుతున్నాయి. పోలింగ్ రోజు సరళి విజయ్ కు అనుకూలంగా ఉందని విజయ్ ప్రభంజనంపై మహా పత్రికలో ప్రత్యేక విశ్లేషణ ప్రచురించిన విషయం విదితమే. ఇండియా టుడే- యాక్సిస్ మై ఇండియా తమిళనాడులో అతిపెద్ద పార్టీగా విజయ్ టీవీకే అవతరించబోతున్నదని తేల్చిచెప్పింది. విజయ్ పార్టీకి 98-120, స్టాలిన్ డీఎంకే కు 92-110, ఎడీఎంకేకు 22-30 స్థానాలు రావొచ్చని అంచనా వేసింది. తమిళనాడులో డీఎంకేకు 35శాతం, టీవీకే 35శాతం, ఎడీఎంకేకు 23శాతం ఓట్ షేర్ వస్తుందని ఎగ్జిట్ పోల్ అంచనాలు వెల్లడించాయి.



## తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి పచ్చజెండా
### వంద టీఎంసీల లక్ష్యంగా బ్యారేజీ నిర్మాణం

వర్షా కాలంలోపే సామర్థ్య పరీక్షలు కొలిక్కి రావాలి

ముంపునకు గురైతే పరిహారం ఇచ్చేందుకు సిద్ధం

మహారాష్ట్రను ఒప్పించే బాధ్యత కేంద్రమంత్రి కిషన్ రెడ్డిది: సీఎం రేవంత్

**హైదరాబాద్, మహా:** ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణ కార్యాచరణను తక్షణమే వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం వేదికగా నీటిపారుదల శాఖపై జరిగిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఆయన అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ భేటీలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పార్లమెంటు సభ్యులు వేం నరేందర్ రెడ్డి సహా పలువురు సీనియర్ ఇంజనీరింగ్ నిపుణులు పాల్గొన్నారు. బ్యారేజీ ఎత్తు ఎంత ఉంచాలి, ఏ స్థాయిలో నిర్మిస్తే గరిష్ట జలాలను వాడుకునే అవకాశం ఉంటుందనే అంశంపై అధికారులు పక్కా గణాంకాలతో కూడిన సమగ్ర సాంకేతిక ప్రదర్శనను ముఖ్యమంత్రి ముందు ఉంచారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే దాదాపు పదకొండు వేల కోట్ల రూపాయల మేర భారీగా ప్రజా ధనాన్ని వెచ్చించింది. డెబ్బై ఒకటిన్నర కిలోమీటర్ల మేర కాలువల నిర్మాణ పనులు కూడా ఇప్పటికే పూర్తయినట్లు అధికారులు ఈ సమావేశంలో ముఖ్యమంత్రికి వివరించారు.

మిగతా 2లో

## కాళేశ్వరంలో ఆధ్యాత్మిక మహాక్రతువు




- 21 నుంచి సరస్వతీ అంత్య పుష్కరాలు
- రూ. 30.63 కోట్లతో మహా సన్నాహాలు
- అంత్య పుష్కరాలకు అఖండ ఏర్పాట్లు
- 12 రోజులు.. 30 లక్షల మంది భక్తులు
- రూ. 198 కోట్లతో ఆలయ పునర్నిర్మాణం
- పుష్కరాలకు కట్టుదిట్టమైన కవచం

**హైదరాబాద్, మహా:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహా పుణ్యక్షేత్రం కాళేశ్వరం అఖండ ఆధ్యాత్మిక ఘట్టానికి సన్నద్ధమవుతోంది. త్రివేణీ సంగమ క్షేత్రంలో సరస్వతీ అంత్య పుష్కరాలను ఒక మహా యజ్ఞంలా నిర్వహించేందుకు రాష్ట్ర సర్కారు కంకణం కట్టుకుంది. మే 21 నుంచి జూన్ 1 వరకు ఏకబిగిన 12 రోజుల పాటు సాగే ఈ పుణ్యస్నానాలకు ఏకంగా 30 లక్షల మందికి పైగా భక్తులు తరలివస్తారని అధికార యంత్రాంగం అంచనా వేస్తోంది. ఈ ప్రతిష్టాత్మక వేడుకలను సర్వాంగ సుందరంగా నిర్వహించే ఉద్దేశంతో సచివాలయం వేదికగా ఉన్నతస్థాయి ప్రణాళికలు రూపుదిద్దుకున్నాయి. రూ. 30 కోట్లకు పైగా నిధులతో కాళేశ్వరం నూతన శోభను సంతరించుకోబోతోంది.

**మంత్రుల సమన్వయం.. నిధుల ప్రవాహం**

సచివాలయంలో దేవాదాయ అటవీ పర్యావరణ శాఖల మంత్రితో పాటు సమాచార సాంకేతిక పరిశ్రమల శాఖల మంత్రి సంయుక్తంగా ఈ పుష్కరాల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. క్షేత్రస్థాయిలో భక్తులకు కించిత్ కూడా అసౌకర్యం కలగకుండా చూసేందుకు కట్టుదిట్టమైన వ్యూహరచన చేశారు. పుష్కరాల ప్రాశస్త్యాన్ని చాటిచెప్పే అధికారిక ప్రచార చిత్రాలను, దృశ్యమాలికలను మంత్రులు లాంఛనంగా ఆవిష్కరించారు.

మిగతా 2లో

## పది ఫలితాల్లో వికసించిన పల్లె సిరి

- ములుగు జిల్లాకు అగ్రస్థానం.. వెనుకబడిన భాగ్యనగరం
- 96.26 శాతం ఉత్తీర్ణతతో సరికొత్త రికార్డు సృష్టించిన బాలికలు
- 588 మార్కులతో రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన ప్రతిభామూర్తులు
- 100 శాతం ఫలితాలతో ఆదర్శంగా నిలిచిన 5,731 పాఠశాలలు

**హైదరాబాద్, మహా:** తెలంగాణ విద్యా రంగంలో కీలక ఘట్టమైన పదో తరగతి ఫలితాల పర్వం అట్టహాసంగా ముగిసింది. బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని నాంపల్లిలో గల గోదావరి ఆడిటోరియంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు అధికారికంగా ఈ ఫలితాలను విడుదల చేశారు. 2026 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం చేపట్టిన విద్యా సంస్కరణలు, ముఖ్యంగా 'అమ్మ ఆదర్శ పాఠశాల' వంటి పథకాల ప్రభావం ఈ ఫలితాల్లో స్పష్టంగా కనిపించింది. గతేడాది కంటే ఈసారి ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగి 95.15 శాతానికి చేరుకోవడం విశేషం. మొత్తం 5,28,239 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, అందులో 4,97,312 మంది విజయవంతంగా

మిగతా 2లో

## సేవాదళ్ కార్యకర్తలే పార్టీకి అసలైన సైనికులు
### రాజకీయాలు అంటే నేడు అర్థం మారిపోయింది

నేను. నాది' అనే స్వార్థం పెరిగి, 'మనం.. మనది' అనే సామాజిక స్పృహ తగ్గిపోతోంది

ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్, మహా :** కాంగ్రెస్ పార్టీలో సేవాదళ్ అనేది కేవలం ఒక విభాగం మాత్రమే కాదని, అది క్రమశిక్షణకు మారుపేరుగా, అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తుందని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. టీపీసీసీ సేవాదళ్

మిగతా 2లో



# బెంగాల్.. తమిళనాడులో హోరాహోరీ

(మొదటిపేజీ తరువాయి)

దేశవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ రేకెత్తిస్తున్న ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల ముందస్తు సర్వే అంచనాలు వెలువడ్డాయి. పశ్చిమ బెంగాల్, అసోం, కేరళ, తమిళనాడు రాష్ట్రాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరి ఎన్నికల సరళిపై వివిధ సర్వే సంస్థలు తమ లోతైన విశ్లేషణలను బహిర్గతం చేశాయి. ఈ 5 ప్రాంతాల్లో రాజకీయ ముఖచిత్రం పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది. పశ్చిమ బెంగాల్‌లో అధికార పీఠం కోసం రెండు ప్రధాన పక్షాల మధ్య అత్యంత భీకరమైన పోరు సాగుతుండగా అస్సాం, పుదుచ్చేరిలలో జాతీయ పార్టీ నేతృత్వంలోని కూటమి స్పష్టమైన ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, తమిళనాడులలో ప్రాంతీయ, వామపక్ష పార్టీలు విజయదుందుభి మోగించే దిశగా పయనిస్తున్నాయి.

**పశ్చిమ బెంగాల్**

పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో మొత్తం 294 శాసనసభ స్థానాలు ఉన్నాయి. ఇక్కడ అధికారం చేపట్టాలంటే 148 స్థానాల్లో గెలుపొందాల్సి ఉంటుంది. అధికార తృణమూల్ కాంగ్రెస్, జాతీయ పార్టీ మధ్య ముఖాముఖి పోరు అత్యంత హోరాహోరీగా సాగినట్లు సర్వే సంస్థల విశ్లేషణలు స్పష్టం చేస్తున్నాయి. పీపుల్స్ పల్స్ అంచనాల ప్రకారం అధికార పక్షం 177 నుంచి 187 స్థానాలు కైవసం చేసుకుని తిరుగులేని విజయం సాధించనుండగా ప్రతిపక్ష పార్టీ 95 నుంచి 110 స్థానాలకే పరిమితం కానుంది. ఎస్‌ఏఎస్ గ్రూప్ అంచనాలు సైతం ఇదే వాదనను బలపరుస్తూ అధికార పక్షానికి 170 నుంచి 190 స్థానాలు దక్కుతాయని ప్రకటించింది. బీకాన్ సంస్థ అంచనా ప్రకారం తృణమూల్ కూటమి 149 నుంచి 154 స్థానాలు సాధించి బొటాబొటీ ఆధిక్యంతో గట్టెక్కే అవకాశం ఉంది. ఈ సర్వేలో ప్రతిపక్షానికి 136 నుంచి 141 స్థానాలు వస్తాయని పేర్కొనడం ద్వారా పోరు ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. చాణక్య స్ట్రాటజీస్ సర్వే సంస్థ మాత్రం బెంగాల్ గడ్డపై సంచలనం నమోదు కాబోతోందని, కాషాయ దళం 150 నుంచి 160 స్థానాలు సాధించి అధికార పీఠాన్ని దక్కించుకుంటుందని కుండబద్దలు కొట్టింది.

**కేరళ:**

140 శాసనసభ స్థానాలున్న కేరళ రాష్ట్రంలో ముందస్తు అంచనాలు సరికొత్త చరిత్రను లిఖించబోతున్నాయి. నాలుగు దశాబ్దాలుగా ఇక్కడ ప్రతి ఎన్నికల్లోనూ అధికార మార్పిడి జరగడం ఆనవాయితీగా వస్తోంది. తాజా అంచనాల ప్రకారం అధికార వామపక్ష కూటమి ఆ ఆనవాయితీని బద్దలు కొడుతూ వరుసగా రెండోసారి అధికార పీఠాన్ని దక్కించుకోనున్నట్లు స్పష్టమవుతోంది. యాక్సిస్ మై ఇండియా సర్వే ప్రకారం అధికార కూటమికి 104 నుంచి 120 స్థానాలు రానుండగా ప్రతిపక్ష కాంగ్రెస్ కూటమికి 20 నుంచి 36 స్థానాలు దక్కే అవకాశం ఉంది. సీఓటర్, రిపబ్లిక్ సంస్థల సర్వేలు సైతం వామపక్షాలకే 70 కి పైగా స్థానాలు వస్తాయని, ప్రతిపక్షం 60 స్థానాలకే పరిమితమవుతుందని తేల్చిచెప్పాయి. ఇక్కడ మూడో పక్షంగా బరిలోకి దిగిన జాతీయ పార్టీకి 1 లేదా 2 స్థానాలు దక్కుతాయని, లేదంటే ఖాతా తెరవడం కూడా కష్టమేనని విశ్లేషకులు భావిస్తున్నారు.

**తమిళనాడు:**

234 శాసనసభ స్థానాలున్న తమిళనాడులో పదేళ్ల తర్వాత అధికార మార్పిడి ఖాయమని సర్వేలన్నీ ఏకగ్రీవంగా తీర్మానించాయి. ఇక్కడ ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే 118 మంది శాసనసభ్యుల బలం అవసరం. ప్రధాన ప్రతిపక్షమైన ద్రవిడ మున్నేట్ర కజగం నేతృత్వంలోని కూటమి ఏకపక్ష విజయం దిశగా దూసుకుపోతున్నట్లు ముందస్తు అంచనాలు వెల్లడించాయి. అత్యధిక సర్వే సంస్థలు ద్రవిడ మున్నేట్ర కజగం కూటమికి 160 నుంచి 190 కి పైగా స్థానాలు దక్కుతాయని అంచనా వేశాయి. యాక్సిస్ మై ఇండియా అంచనాల ప్రకారం ప్రతిపక్ష కూటమికి 175 నుంచి 195 స్థానాలు రానుండగా అధికార అన్నా డీఎంకే కూటమి కేవలం 38 నుంచి 54 స్థానాల వద్దే చతికిలపడనుంది. చాణక్య అంచనాలు సైతం ఇదే తీరులో ద్రవిడ మున్నేట్ర కజగంకు 180 కి పైగా స్థానాలను కట్టబెట్టాయి.

**పుదుచ్చేరి:**

కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో మొత్తం 30 శాసనసభ స్థానాలు ఉండగా 16 స్థానాలు సాధించిన వారు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారు. ఇక్కడ జాతీయ ప్రజాస్వామ్య కూటమి అధికార పీఠాన్ని కైవసం చేసుకోనున్నట్లు సర్వేలు కుండబద్దలు కొట్టాయి. రిపబ్లిక్ సంస్థ అంచనాల ప్రకారం ఈ కూటమికి 16 నుంచి 20 స్థానాలు దక్కనుండగా ప్రతిపక్ష కూటమి 11 నుంచి 12 స్థానాలకే పరిమితం కానుంది. సీఓటర్ సర్వే సైతం జాతీయ ప్రజాస్వామ్య కూటమికి 19 నుంచి 23 స్థానాలు దక్కుతాయని స్పష్టం చేసింది. దీన్ని బట్టి పుదుచ్చేరిలో ప్రాంతీయ పార్టీ, జాతీయ పార్టీల పొత్తు విజయవంతమైనట్లు విశ్లేషణలు చెబుతున్నాయి.

**అస్సాం:**

126 శాసనసభ స్థానాలున్న అస్సాం రాష్ట్రంలో అధికార పీఠాన్ని దక్కించుకోవడానికి 64 స్థానాలు అవసరం. ఇక్కడ అధికార కూటమి ప్రభంజనం సృష్టించడం ఖాయమని సర్వే సంస్థలన్నీ చెప్పాయి. ప్రధాన ప్రతిపక్షం ఏ దశలోనూ అధికార పక్షానికి కనీస పోటీ కూడా ఇవ్వలేక చతికిలపడినట్లు గణాంకాలను బట్టి స్పష్టమవుతోంది. టీమ్ పీఎస్ఆర్ అంచనాల ప్రకారం అధికార పక్షం 88 నుంచి 96 స్థానాలు కైవసం చేసుకోనుండగా ప్రతిపక్ష కూటమి కేవలం 24 నుంచి 40 స్థానాల వద్దే ఆగిపోనుంది. పీపుల్స్ పల్స్ సర్వే సైతం అధికార పక్షానికి 83 నుంచి 91 స్థానాలు దక్కనుండగా ప్రతిపక్షం 23 నుంచి 30 స్థానాలకే పరిమితం కానుందని అంచనా వేసింది. ఎస్‌ఏఎస్ గ్రూప్ అంచనాల్లో అధికార పార్టీకి 84 నుంచి 90 స్థానాలు, బీకాన్ సంస్థ అంచనాల్లో 77 నుంచి 82 స్థానాలు దక్కుతాయని నిక్కచ్చిగా తేల్చిచెప్పాయి. ప్రజా తీర్పు అసలు స్వరూపం తెలియాలంటే తుది ఫలితాలు వెలువడే వరకు వేచి చూడక తప్పదు.

## కాళేశ్వరంలో ఆధ్యాత్మిక
# మహాక్రతువు

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర ముఖ్యమంత్రి మార్గదర్శకత్వంలో కాళేశ్వరం దేవస్థాన సమగ్ర పునర్నిర్మాణానికి ఏకంగా రూ. 198 కోట్లను మంజూరు చేయడం ఈ క్షేత్రం పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనంగా మంత్రులు అభివర్ణించారు.

**యుద్ధ ప్రాతిపదికన 162 పనులు**

పుష్కరాల ప్రాంగణాన్ని సకల సదుపాయాలతో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం భారీ ఎత్తున నిధులు వెచ్చిస్తోంది. కేవలం మౌలిక వసతుల కల్పన కోసమే రూ. 30.63 కోట్లను కేటాయించి ఏకంగా 162 పనులను యుద్ధ ప్రాతిపదికన పరుగులు పెట్టిస్తోంది. ఈ పనులన్నింటినీ పుష్కరాలు ప్రారంభం కావడానికి 10 రోజుల ముందే పూర్తి చేసి తీరాలని మంత్రులు అధికారులకు గట్టిగా ఆదేశాలు జారీ చేశారు. స్నానఘట్టాల వద్ద పటిష్టమైన భద్రత, వాహనాల రద్దీకి ఆటంకం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లతో పాటు పారిశుధ్యం, తాగునీరు, వైద్య శిబిరాల ఏర్పాటులో అంగుళం కూడా రాజీ పడొద్దని తేల్చిచెప్పారు.

**ఆధ్యాత్మిక ముహూర్తం.. అఖండ మహా హారతి**

మే 21 వేకువజామున 5:43 గంటలకు కంచికామకోటి పీఠాధిపతి శంకర విజేంద్ర సరస్వతీ స్వామి వారి పవిత్ర స్నానాచరణతో ఈ అంత్య పుష్కరాలు లాంఛనంగా ప్రారంభమవుతాయి. ఈ 12 రోజుల పాటు ప్రతి ఉదయం ప్రముఖ పీఠాధిపతులతో ప్రత్యేక స్నానాలు ఆచరించేలా దేవాదాయ శాఖ ఒక ప్రణాళికను సిద్ధం చేసింది. సాయంసంధ్య వేళ త్రివేణీ సంగమం వద్ద అద్భుతమైన దృశ్యం సాక్షాత్కరించనుంది. కాశీ పీఠం నుంచి విచ్చేసిన పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ రోజూ సాయంత్రం 6:30 గంటలకు అఖండ మహా హారతిని అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. పుష్కరాల విశిష్టతను మరింత పెంచేలా రాష్ట్ర ప్రథమ పౌరులను సైతం అధికార యంత్రాంగం లాంఛనప్రాయంగా ఆహ్వానించింది. మొత్తంగా చూస్తే 30 లక్షల మంది భక్తజన సంద్రంతో కాళేశ్వరం అఖండ ఆధ్యాత్మిక శోభను సంతరించుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

# తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి పచ్చజెండా

(మొదటిపేజీ తరువాయి)



ఈ నేపథ్యంలో వృథాగా పడి ఉన్న కాలువలను, పూర్తయిన నిర్మాణాలన్నింటినీ సద్వినియోగం చేసుకుంటేనే ప్రభుత్వ ఖజానాకు న్యాయం జరుగుతుందని, ఏమాత్రం జాప్యం లేకుండా బ్యారేజీ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**నూట యాభై మీటర్లే సరైన మార్గం.. వంద టీఎంసీల లక్ష్యం**

తుమ్మిడి హెట్టి వద్ద బ్యారేజీ ఎత్తు వివాదంపై ఈ సమావేశంలో నిపుణులు ఒక స్పష్టమైన నిర్ణయానికి వచ్చారు. కనీసం వంద టీఎంసీల ప్రాణహిత జలాలను వినియోగించుకుని తెలంగాణ రైతాంగ ప్రయోజనాలు నెరవేరాలంటే బ్యారేజీని కచ్చితంగా నూట యాభై మీటర్ల ఎత్తులో నిర్మించడమే ఏకైక మార్గమని ఇంజినీరింగ్ నిపుణులు కుండబద్దలు కొట్టారు. గతంలో జరిగిన అంతర్రాష్ట్ర చర్చల ప్రకారం బ్యారేజీని నూట నలభై ఎనిమిది మీటర్ల ఎత్తులో నిర్మించేందుకు మహారాష్ట్ర అంగీకారం తెలిపిన విషయాన్ని అధికారులు గుర్తు చేశారు. ఒకవేళ నూట యాభై రెండు మీటర్ల ఎత్తుకు వెళితే పొరుగు రాష్ట్రంలో ముంపు ప్రభావం తీవ్రంగా ఉంటుందని నివేదించారు. ఈ సంక్లిష్ట సమస్యను అధిగమించేందుకు మధ్యేమార్గంగా నూట యాభై మీటర్ల ఎత్తులో నిర్మాణాన్ని చేపడితే అటు ముంపు సమస్య పెద్దగా ఉండదని, ఇటు అతి తక్కువ ఖర్చుతో ప్రాణహిత నీటిని తీసుకునే వెసులుబాటు ఉంటుందని వారు స్పష్టం చేశారు.

**సహజ ప్రవాహంతో అద్భుత ప్రయోజనాలు**

తుమ్మిడి హెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణం పూర్తయితే ఎదురయ్యే అద్భుతమైన ప్రయోజనాలను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. బ్యారేజీ పూర్తయితే ఆదిలాబాద్ జిల్లాతో పాటు ఇతర మెట్ట ప్రాంతాల రైతాంగానికి సాగునీరు, తాగునీటి కష్టాలు శాశ్వతంగా తీరిపోతాయని ఆయన వివరించారు. ముఖ్యంగా భారీ మోటార్ల అవసరం లేకుండా, ఏమాత్రం విద్యుత్ ఖర్చు భారం పడకుండానే నేరుగా సహజ ప్రవాహం (గ్రావిటీ) ద్వారా శ్రీపాద ఎల్లంపల్లి జలాశయానికి నీటిని తరలించే సువర్ణ అవకాశం కలుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు భవిష్యత్తు సాగునీటి అవసరాలకు అత్యంత ప్రాధాన్యత కలిగినది కావడంతో తక్షణమే పొరుగు రాష్ట్రంతో దౌత్యపరమైన మంతనాల ప్రక్రియను ప్రారంభించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. నూట యాభై మీటర్ల ఎత్తులో నిర్మిస్తే మహారాష్ట్రలో పెద్దగా ముంపు ప్రమాదం ఉండదని, ఒకవేళ ఎక్కడైనా కొద్దిపాటి భూమి ముంపునకు గురైతే దానికి తగిన పరిహారం చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని ఆయన చారిత్రక ప్రకటన చేశారు.

**కేంద్ర మంత్రికి దౌత్య బాధ్యతలు.. మేడిగడ్డపై ప్రత్యేక దృష్టి**

అంతర్రాష్ట్ర జల వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సరికొత్త రాజకీయ దౌత్యానికి తెరతీశారు. మహారాష్ట్రలో ప్రస్తుతం జాతీయ పార్టీ అధికారంలో ఉన్న దృష్ట్యా ఆ ప్రభుత్వాన్ని ఒప్పించి తెలంగాణ ప్రయోజనాలను కాపాడే బాధ్యతను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి అప్పగించాలని వ్యూహాత్మక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ రైతాంగం పక్షాన మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించడంలో సహకరించాలని కోరుతూ కిషన్ రెడ్డికి తక్షణమే లేఖ రాయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఆయన సూచించారు. సమీక్ష ముగిసిన వెంటనే ఈ లేఖను పంపాలని, తదుపరి రోజు కేంద్ర మంత్రిని నేరుగా కలిసి ఈ అత్యవసర ప్రాజెక్టుపై లోతుగా చర్చించాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు. ఇదే క్రమంలో మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ చర్యల్లో భాగంగా అక్కడ కొనసాగుతున్న భూగర్భ సామర్థ్య పరీక్షలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను కఠినంగా ఆదేశించారు. రాబోయే వర్షాకాలం లోపే ఈ పరీక్షల ప్రక్రియ మొత్తం ఒక కొలిక్కి రావాలని, ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని ఆయన యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.

# మే 10న జనాగ్రహ సభకు మోదీ

(మొదటిపేజీ తరువాయి)

యంత్రాంగం శక్తివంచన లేకుండా కృషి చేస్తోందని ఈ సందర్భంగా నేతలు ప్రకటించారు. తెలంగాణలో మార్పునకు సంకేతం బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల ఆశలను వమ్ము చేసిందని రాంచందర్ రావు ధ్వజమెత్తుతున్నారు. గత పదేళ్ల పాలనలో కేవలం కుటుంబ ప్రయోజనాలకే ఆ పార్టీ ప్రాధాన్యతనిచ్చిందని, ప్రజల సమస్యలను గాలికొదిలేసిందని విమర్శించారు. అటువంటి అవకాశవాద రాజకీయాలు ఇకపై తెలంగాణలో సాగవని ఆయన హెచ్చరించారు. బీజేపీ మాత్రమే రాష్ట్రంలో బలమైన ప్రత్యామ్నాయంగా ఎదుగుతోందని, ప్రజలు ఇప్పుడు డబుల్ ఇంజన్ సర్కార్ వైపు మొగ్గు చూపుతున్నారని విశ్లేషించారు. మేధావులు, మహిళలు, ముఖ్యంగా జెన్‌జెడ్ యువత బీజేపీ సిద్ధాంతాలకు ఆకర్షితులవుతున్నారని ఆయన సగర్వంగా ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ తీరును రాంచందర్ రావు తీవ్రంగా ఎండగట్టారు. 'భారత్ జోడో' అంటూ రాహుల్ గాంధీ చేపట్టిన యాత్ర వాస్తవానికి 'భారత్ తోడో' (దేశాన్ని విభజించే) యాత్రగా మారిందని ఎద్దేవా చేశారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ వ్యతిరేకించడం ద్వారా దక్షిణ భారత దేశానికి, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ మహిళలకు అన్యాయం చేసిందని ఆరోపించారు. మహిళా సాధికారతపై మొసలి కన్నీరు కారుస్తూ, క్షేత్రస్థాయిలో మాత్రం హక్కులను కాలరాస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ చర్యల పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, ఆ ఆగ్రహమే మే 10న పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రతిబింబిస్తుందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో మహిళా ప్రాతినిధ్యం విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలూ విఫలమయ్యాయని బీజేపీ ఆరోపిస్తోంది. గత బీఆర్ఎస్ పాలనలో కేబినెట్‌లో మహిళలకు సరైన గుర్తింపు ఇవ్వలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా యువత, మహిళల సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఈ నిరాదరణకు నిరసనగానే 'జన ఆగ్రహ సభ'ను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మహిళా శక్తిని తక్కువగా అంచనా వేసిన ఏ ప్రభుత్వమైనా పతనం కాక తప్పదని, రాబోయే రోజుల్లో మహిళల ఆశీర్వాదంతో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. కేవలం తెలంగాణలోనే కాకుండా దక్షిణాది రాష్ట్రాలన్నింటిలోనూ బీజేపీ హవా మొదలైందని నేతలు అభిప్రాయపడుతున్నారు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో బీజేపీ గణనీయమైన విజయాలను నమోదు చేస్తుందని, పుదుచ్చేరిలో అధికారాన్ని కైవసం చేసుకుంటుందని రాంచందర్ రావు జోస్యం చెప్పారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అంతటా అభివృద్ధి పరుగులు తీస్తోందని, ఆ అభివృద్ధి ఫలాలను ప్రజలు గుర్తిస్తున్నారని తెలిపారు. దక్షిణాదిపై బీజేపీ ప్రత్యేక దృష్టి సారించిందని, అభివృద్ధికి రాజకీయాన్ని జోడించి ప్రజలకు మేలు చేయడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. మే 10వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కానున్న ఈ బహిరంగ సభ కోసం పరేడ్ గ్రౌండ్స్‌లో అద్భుతమైన ఏర్పాట్లు చేస్తున్నారు. లక్షలాది మంది ప్రజలు హాజరయ్యే అవకాశం ఉండటంతో భద్రత, రవాణా సౌకర్యాలపై పార్టీ ముఖ్యనేతలతో రాంచందర్ రావు సమీక్ష నిర్వహించారు. ప్రధాని మోదీ ప్రసంగం వినేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీజేపీ కార్యకర్తలు, సామాన్య ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎయిర్‌పోర్టులో అధికారిక కార్యక్రమాలు ముగించుకుని, నేరుగా సభా వేదికకు చేరుకోనున్న ప్రధానికి చారిత్రాత్మక స్వాగతం పలికేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తెలంగాణ భవిష్యత్తును మార్చబోయే ఈ సభకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వం విజ్ఞప్తి చేస్తోంది. మేధావులు, విద్యావంతులు, యువతీ యువకులు పెద్ద ఎత్తున పాల్గొని దేశ ప్రయోజనాల కోసం మోదీ చేస్తున్న కృషిని బలపరచాలని కోరారు. 'జన ఆగ్రహ సభ' ద్వారా రాష్ట్రంలోని అవినీతి, కుటుంబ పాలనకు వ్యతిరేకంగా గళం ఎత్తాలని పిలుపునిచ్చారు. ఈ సభ తెలంగాణ రాజకీయ చరిత్రలో ఒక నూతన శకానికి నాంది పలుకుతుందని, డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పడే దిశగా మొదటి అడుగు అని రాంచందర్ రావు తన ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి సహా పలువురు అగ్రనేతలు పాల్గొన్నారు.

# నేను మంత్రి పదవి అడగలేదు

**మా నేతలకు నామినేటెడ్ పోస్టులు ఇస్తారని ఆశిస్తున్నా ఎమ్మెల్సీ కోదండరాం**

**హైదరాబాద్, మహా :** తనకు మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ చెప్పలేదని, తాను కూడా అడగలేదని టీజేఎస్ అధినేత, ఎమ్మెల్సీ కోదండరాం స్పష్టం చేశారు. అయితే, తన పార్టీ నాయకులకు ప్రభుత్వం త్వరలోనే నామినేటెడ్ పోస్టులు ఇస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వంలో భాగస్వామ్యం ఉండాలని కోరుకుంటున్నట్లు ఆయన బహిరంగంగానే చెప్పారు. కేసీఆర్ హయాంలో ప్రజలు మరియు నాయకులు ఒక రకమైన 'భయం' నీడలో బతికారని ఆయన ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ వంటి అంశాలను పరోక్షంగా ప్రస్తావిస్తూ, "ఇంట్లో ఫోన్ పెట్టి జాగ్రత్తగా రమ్మనే పరిస్థితి ఉండేది" అని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ప్రజల నుంచి దూరమయ్యారని, అందుకే ఇప్పుడు మళ్లీ ప్రజల్లోకి వచ్చే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇక కవిత కొత్త పార్టీ పెట్టిన నేపథ్యంలో స్పందిస్తూ ఆమె తన మాటల ద్వారా కుటుంబ లోపాలను బయట పెడుతున్నారని, పార్టీ అంటే కేవలం కుటుంబమే అని ఆమె చర్యలు నిరూపిస్తున్నాయని విమర్శించారు. తాము కేవలం ఎన్నికల కోసం కాకుండా 'మార్పు' కోసం పార్టీని నడుపుతున్నామని, అయితే అన్ని ఎన్నికలకూ దూరంగా ఉండలేమని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో (బహుశా మున్సిపల్ లేదా జీహెచ్ఎంసీ) కచ్చితంగా పోటీ చేస్తామని, ముందుగానే నియోజకవర్గాలను ఎంచుకుని పనిచేస్తామని ప్రకటించారు.

# కేసీఆర్ లేకుంటే కవిత ఎవరు?

- **తండ్రికి విలువ ఇవ్వని కవిత ప్రజలకేం మేలు చేస్తారు**
- **కవిత పార్టీపై ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి విమర్శలు**
- **పార్టీ పెట్టడమంటే పాన్ షాప్ పెట్టినంత ఈజీ కాదు**

**హైదరాబాద్, మహా :** మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. డబ్బులు ఉన్నాయని పార్టీ పెట్టడం అంటే పాన్ షాప్ పెట్టినంత సులువు అయిపోయింది అంటూ ఆయన ఎద్దేవా చేశారు. కవిత నూతనంగా ప్రారంభించిన పార్టీ వల్ల ఎటువంటి ఉపయోగం ఉండదని, ఆమెతో ఊదు కాలదు.. పీరు లేవదు అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లో రాణించాలంటే ప్రజాబలం ఉండాలి కానీ, కేవలం ఆర్థిక బలం సరిపోదని ఆయన హితవు పలికారు. కవిత తన మొదటి సమావేశంలోనే సొంత తండ్రి, మాజీ సీఎం కేసీఆర్‌ను విమర్శించడాన్ని రాజగోపాల్ రెడ్డి తీవ్రంగా తప్పుపట్టారు. ఉద్యమకారుడిగా పేరున్న కేసీఆర్‌ను ఆయన బిడ్డ విమర్శించడం తనను బాధించిందని, తండ్రికి విలువ ఇవ్వని వ్యక్తి ప్రజలకు ఏ విధంగా సేవ చేస్తుందని ప్రశ్నించారు. తన అన్న కేటీఆర్ మీద ఉన్న వ్యక్తిగత కోపాన్ని తండ్రి మీద చూపించడం సరైన పద్ధతి కాదని, టీఆర్ఎస్ పేరుతో పార్టీ పెట్టి కేసీఆర్‌ను విమర్శించడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. కవితకు కేవలం ఉద్యమకారుడి బిడ్డగానే గుర్తింపు ఉందని, అంతకు మించి ఆమెకు వ్యక్తిగత ఛరిష్మా లేదని రాజగోపాల్ రెడ్డి విమర్శించారు. ఆమె పార్టీ పెట్టడం పక్కన పెడితే, రాబోయే ఎన్నికల్లో పోటీ చేస్తే కనీసం డిపాజిట్ కూడా రాదని జోస్యం చెప్పారు. అలాగే ఢిల్లీ మద్యం కుంభకోణం కేసును ప్రస్తావిస్తూ.. ఆ కేసులో ఆమెకు ఇంకా క్లీన్ చిట్ రాలేదని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని ఆయన గుర్తు చేశారు.

**మంత్రి పదవి ఇస్తే న్యాయం చేస్తా !**

మంత్రి పదవిపై ప్రస్తావించిన రాజగోపాల్ రెడ్డి పార్టీ అధిష్టానం తనకు ముందే హామీ ఇచ్చిందని పునరుద్ఘాటించారు. ఒకవేళ తనకు మంత్రి పదవి దక్కితే, ఆ బాధ్యతకు పూర్తి స్థాయిలో న్యాయం చేస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తానని, పదవులు ఉన్నా లేకున్నా తాను ప్రజల మనిషినేనని రాజగోపాల్ రెడ్డి మరోమారు స్పష్టం చేశారు.

# సేవాదళ్ కార్యకర్తలే పార్టీకి అసలైన సైనికులు

(మొదటిపేజీ తరువాయి)




ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న 'సమర్థ్' శిక్షణా శిబిరానికి బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలం నుంచి నేటి వరకు నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయడంలో సేవాదళ్ వాలంటీర్లు ఎప్పుడూ ముందుంటారని, పార్టీ సిద్ధాంతాలను సామాన్య ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వీరు బలమైన వారధిలా పనిచేస్తున్నారని మంత్రి ప్రశంసించారు. ఇటువంటి శిబిరాల ద్వారా కార్యకర్తల్లో నాయకత్వ పటిమతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, ఇది పార్టీ బలోపేతానికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై మంత్రి ఆవేదన వ్యక్తం చేస్తూ.. ఇవాళ రాజకీయాల్లో అర్థాలు పూర్తిగా మారిపోయాయన్నారు. 'నేను.. నాది' అనే స్వార్థం పెరిగిపోయి, 'మనం.. మనది' అనే సామాజిక స్పృహ తగ్గిపోతోందన్నారు. రాజకీయాల్లో కేవలం ఎలా సంపాదించుకోవాలనే ధ్యాస పెరిగి, సేవాభావం క్రమంగా క్షీణిస్తోందని అభిప్రాయపడ్డారు. సమాజంలో నేటికీ ఎంతోకొంత విలువలు మిగిలి ఉన్నాయంటే అది సేవాదళ్ వంటి నికార్సైన నాయకులు, వాలంటీర్ల కృషి వల్లేనని ఆయన స్పష్టం చేశారు. మారుతున్న రాజకీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని, ప్రత్యర్థులు సామాజిక మాధ్యమాల వేదికగా చేస్తున్న అసత్య ప్రచారాలను ధీటుగా తిప్పికొట్టేలా కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడుతున్న సేవాదళ్ కార్యకర్తలకు గుర్తింపు దక్కేలా చూస్తానని మంత్రి ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. నిబద్ధతతో పని చేస్తున్న వారికి నామినేటెడ్ పదవుల్లో తప్పకుండా అవకాశం కల్పించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లి తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.

# పది ఫలితాల్లో వికసించిన పల్లె సిరి

(మొదటిపేజీ తరువాయి)

ఉత్తీర్ణత సాధించి తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకున్నారు.

**అమ్మాయిల అప్రతిహత విజయం**

రాష్ట్రవ్యాప్త ఉత్తీర్ణత గణాంకాలను పరిశీలిస్తే బాలికలు మరోసారి తమ ఆధిపత్యాన్ని చాటుకున్నారు. బాలుర కంటే బాలికలే అత్యధిక శాతం ఉత్తీర్ణత సాధించి రికార్డు సృష్టించారు. బాలికల ఉత్తీర్ణత శాతం 96.26 నమోదు కాగా, బాలురు 94.07 శాతంతో సరిపెట్టుకున్నారు. సుమారు రెండు శాతం మేర బాలికలు పైచేయి సాధించడం ద్వారా రాష్ట్రంలో మహిళా విద్యా చైతన్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. సుమారు 2.56 లక్షల మంది విద్యార్థినులు ఉన్నత విద్యకు అర్హత సాధించడం రాష్ట్ర పురోభివృద్ధికి శుభ సూచకం. గ్రామీణ ప్రాంతాల్లో సైతం తల్లిదండ్రులు తమ ఆడబిడ్డల చదువు పట్ల తీసుకుంటున్న శ్రద్ధ ఈ ఫలితాల్లో ప్రతిబింబిస్తోంది.

**ములుగు ప్రభంజనం...నగర వెనుకబాటు**

జిల్లాల వారీ ప్రదర్శనలో ఈసారి అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. మారుమూల అటవీ ప్రాంతాలు, ఏజెన్సీ గ్రామాలతో కూడిన ములుగు జిల్లా ఏకంగా *99.30 శాతం* ఉత్తీర్ణతతో రాష్ట్రంలోనే ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని అందరినీ విస్మయానికి గురిచేసింది. ఇక్కడి ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ, రాత్రి సమయాల్లో నిర్వహించిన స్టడీ అవర్స్ ఈ ఘన విజయానికి తోడ్పడ్డాయి. దీనికి విరుద్ధంగా, అన్ని రకాల వసతులు, కోచింగ్ సెంటర్లు అందుబాటులో ఉన్న రాజధాని హైదరాబాద్ జిల్లా కేవలం *89.23 శాతంతో* రాష్ట్రంలోనే ఆఖరి స్థానానికి పరిమితం కావడం విద్యావేత్తలను ఆందోళనకు గురిచేసింది. నగర ప్రాంతాల్లో విద్యార్థులు సెల్‌ఫోన్ వాడకం, ఇతర పరధ్యాన అంశాల వైపు మళ్ళడం ఈ వెనుకబాటుకు కారణమని భావిస్తున్నారు.

**రాష్ట్రస్థాయి టాపర్ల విజయగాథలు**

అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల జాబితాలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మేధావులు తమ సత్తా చాటారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన *కొప్పుల సాయి కిరణ్ 588 మార్కులతో* రాష్ట్రస్థాయిలో అగ్రశ్రేణిలో నిలవగా, మేడ్చల్ జిల్లా విద్యార్థిని మందవ గీతిక 583 మార్కులతో ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. వీరితో పాటు సంగారెడ్డికి చెందిన తోక చతుర్వేద్ (580), హన్మకొండకు చెందిన తుముల నిత్య హాసిని (579), మేడ్చల్‌కు చెందిన హితేష్ పుసర్ల (575) తమ అసాధారణ ప్రతిభతో మెరిశారు. అలాగే రంగారెడ్డి జిల్లాకు చెందిన విస్తారకుల సాయి శరణ్‌దీప్, సబ్బం మోక్షిత్ నాయుడు, కొత్తపల్లి శ్రీపాద చైత్రిక, మహమ్మద్ జునైద్ అహ్మద్, ములుగు జిల్లాకు చెందిన సభావత్ పవిత్ర టాప్ 10 జాబితాలో నిలిచి తమ తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు కీర్తిని చేకూర్చారు.

**100 శాతం ఫలితాలతో రికార్డు**

పాఠశాలల వారీగా ఫలితాలను విశ్లేషిస్తే రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 5,731 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించి తమ విద్యా ప్రమాణాలను చాటుకున్నాయి. ఇందులో అత్యధికంగా ప్రభుత్వ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలు ఉండటం విశేషం. గురుకులాలు 99.1 శాతం ఫలితాలతో ప్రైవేట్ విద్యా సంస్థలకు దీటైన పోటీనిస్తూ అగ్రభాగాన నిలిచాయి. ప్రభుత్వ పాఠశాలల్లో సైతం 86.18 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం గమనార్హం. అయితే మరోవైపు 6 ప్రైవేట్ పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా ఉత్తీర్ణత సాధించలేకపోవడం అధికార యంత్రాంగాన్ని విస్మయానికి గురిచేసింది. నిబంధనలు పాటించని, నాణ్యమైన బోధన అందించని ఇటువంటి విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

**సోషల్ స్టడీస్‌లో విద్యార్థుల జోరు**

విద్యార్థులు సబ్జెక్టుల వారీగా కూడా అద్భుతమైన ప్రతిభను కనబరిచారు. ముఖ్యంగా సామాజిక శాస్త్రం లో అత్యధికంగా 99.61 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అలాగే తెలుగు భాషలో 99.12 శాతం, గణితంలో 97.46 శాతం మంది ఉత్తీర్ణత సాధించి తమ మేధస్సును నిరూపించుకున్నారు. గతంలో గణితం, సైన్స్ వంటి సబ్జెక్టుల పట్ల ఉండే భయాన్ని విద్యార్థులు అధిగమించినట్లు ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రశ్నపత్రాల సరళీకరణ, ఉపాధ్యాయుల ప్రత్యేక బోధనా పద్ధతులు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపాయి. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా సగటు గ్రేడ్ పాయింట్లు కూడా గతంతో పోలిస్తే మెరుగుపడటం విశేషం.

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు**

పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. రాష్ట్ర విద్యార్థులు దేశ గతిని మార్చే మేధావులుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడానికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. మారుమూల జిల్లాల విద్యార్థులు సాధించిన ఘనతను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ఉన్నత విద్యలోనూ ఇదే ఉత్సాహాన్ని కొనసాగించి రాష్ట్రానికి గర్వకారణంగా నిలవాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. విద్యార్థుల కోసం త్వరలోనే మరిన్ని విద్యా సంస్కరణలు ప్రవేశపెడతామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

**సప్లిమెంటరీ అభ్యర్థులకు ధైర్యం**

పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయిన విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ అధైర్యపడవద్దని విద్యాశాఖ భరోసా ఇచ్చింది. జూన్ నెలలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పట్టుదలతో చదివి పైతరగతులకు వెళ్లాలని సూచించారు. ఒకసారి ఫెయిల్ అవ్వడం అంటే జీవితంలో ఓడిపోవడం కాదని, పట్టుదలతో మళ్లీ ప్రయత్నించి విజయం సాధించాలని పెద్దలు హితవు పలికారు. రీవెరిఫికేషన్, రీకౌంటింగ్ కోరుకునే వారు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు వెల్లడించారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో
# రాష్ట్ర నూతన డీజీపీ సీవీ ఆనంద్ భేటీ

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్ర నూతన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా నియమితులైన సీవీ ఆనంద్ బుధవారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో గల స్టేట్ పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఈ భేటీ జరిగింది. రాష్ట్ర పోలీసు బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో జరిగిన ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజా పాలనలో పోలీసు వ్యవస్థ కీలక పాత్ర పోషించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు. ముఖ్యంగా మాదక ద్రవ్యాల నిర్మూలన, మహిళల భద్రత మరియు సైబర్ నేరాల అదుపు విషయంలో కఠినంగా వ్యవహరించాలని, ప్రజలకు పోలీసుల పట్ల భరోసా కల్పించేలా విధులు నిర్వహించాలని ఆయన దిశానిర్దేశం చేశారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర శాంతిభద్రతల సారథిగా బాధ్యతలు అప్పగించినందుకు సీవీ ఆనంద్ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ వేదికగా జరిగిన ఈ భేటీలో రాష్ట్రంలో నేరాల నియంత్రణకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించుకోవడంపై ప్రాథమికంగా చర్చించారు. నిజాయితీ, అంకితభావంతో పనిచేసి రాష్ట్ర ప్రతిష్టను పెంపొందిస్తానని డీజీపీ ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు విభాగంలోని పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణలో చమురు కొరత లేదు



**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ సహా తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పెట్రోల్, డీజిల్ కొరత ఉందంటూ సాగుతున్న ప్రచారంపై కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి అత్యంత స్పష్టమైన వివరణ ఇచ్చారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎక్కడా ఇంధన కొరత లేదని, ప్రజల్లో భయాందోళనలు సృష్టించడానికే కొందరు ఇటువంటి కుట్రలకు తెరలేపారని మండిపడ్డారు. గతంలో ఎల్పీజీ విషయంలోనూ ఇటువంటి అసత్య ప్రచారాలు జరిగాయని, ఇప్పుడు చమురు ఉత్పత్తులపై కూడా అదే పద్ధతిని అనుసరిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం చమురు సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తోందని, సామాన్య ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన భరోసా ఇచ్చారు.

రాష్ట్రంలో చమురు సరఫరాకు సంబంధించిన గణాంకాలను కిషన్ రెడ్డి ఈ సందర్భంగా వెల్లడించారు. తెలంగాణలో సాధారణంగా రోజుకు సుమారు 6,400 కిలోలీటర్ల పెట్రోల్ సరఫరా జరుగుతుండగా, ప్రస్తుత గిరాకీని దృష్టిలో ఉంచుకుని దానిని ఏకంగా 10,300 కిలోలీటర్లకు పెంచామని తెలిపారు. ఇక హైదరాబాద్ నగరంలో సాధారణంగా 3,200 కిలోలీటర్ల సరఫరా ఉండగా, ఇప్పుడు దానిని 6,400 కిలోలీటర్లకు అంటే రెట్టింపు చేశామని వివరించారు. డీజిల్ విషయంలో కూడా సాధారణంగా ఉండే 8,000 కిలోలీటర్ల సరఫరాను ప్రస్తుతం 15,500 కిలోలీటర్లకు పెంచడమే కాకుండా, రాబోయే రోజుల్లో దీనిని 19,300 కిలోలీటర్ల వరకు తీసుకెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. ఇంత భారీ స్థాయిలో సరఫరా జరుగుతుంటే కొరత ఎక్కడ ఉంటుందని ఆయన ప్రశ్నించారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మొత్తం 4,325 పెట్రోల్ బంకులలో ఉదయం వరకు కేవలం 106 పంపుల్లో మాత్రమే తాత్కాలికంగా 'నో స్టాక్' బోర్డులు కనిపించాయని కిషన్ రెడ్డి వివరించారు. ఇది కూడా చమురు కొరత వల్ల కాదని, రవాణాలో జరిగిన జాప్యం లేదా సదరు బంకుల యజమానులు ముందస్తు చెల్లింపులు చేయకపోవడం వల్ల తలెత్తిన సమస్య మాత్రమేనని స్పష్టం చేశారు. అటువంటి తాత్కాలిక సమస్యలను కూడా చమురు సంస్థలు యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తున్నాయని తెలిపారు. కేవలం ఒక శాతం కంటే తక్కువ బంకుల్లో ఉన్న ఇబ్బందులను చూపిస్తూ మొత్తం రాష్ట్రమంతా కొరత ఉందని ప్రచారం చేయడం వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు.

భారతదేశం తన చమురు అవసరాల కోసం సుమారు 88 శాతం ఇతర దేశాలపై ఆధారపడి ఉన్న విషయాన్ని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న కొన్ని భౌగోళిక రాజకీయ పరిస్థితులు, యుద్ధ వాతావరణం వల్ల క్రూడ్ ఆయిల్ సరఫరాలో అంతర్జాతీయంగా కొన్ని ఇబ్బందులు ఉన్న మాట వాస్తవమేనని అంగీకరించారు. అయితే, భారత ప్రభుత్వం దౌత్యపరమైన చొరవతో అనేక దేశాల నుంచి ముడి చమురును దిగుమతి చేసుకుంటూ దేశీయంగా ఎక్కడా కొరత రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. అంతర్జాతీయ ఒడిదుడుకులు ఉన్నప్పటికీ, భారతీయ వినియోగదారుడిపై ఆ భారం పడకుండా మోదీ ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తోందని ఆయన పేర్కొన్నారు.

కొంతమంది రాజకీయ నాయకులు, స్వార్థ ప్రయోజనాల కోసం సోషల్ మీడియా వేదికగా చమురు ధరలు పెరిగిపోతాయంటూ చేస్తున్న తప్పుడు ప్రచారాలే ప్రస్తుత గందరగోళానికి కారణమని కిషన్ రెడ్డి విశ్లేషించారు. ఈ అసత్య వార్తలను నమ్మి ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని, అవసరానికి మించి ఇంధనాన్ని నిల్వ చేసుకోవడానికి ఎగబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఇలా ఒక్కసారిగా బంకులకు తరలిరావడం వల్ల సాధారణ సరఫరా వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతోందని, దీనివల్ల కావాలని కొరత సృష్టించినట్లు కనిపిస్తోందని చెప్పారు. ప్రజలు ఇటువంటి పుకార్లను నమ్మవద్దని, శాంతియుతంగా ఉండాలని ఆయన కోరారు.

ప్రస్తుత వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని కిషన్ రెడ్డి ప్రజలకు ఒక ముఖ్యమైన హెచ్చరిక చేశారు. భయంతో కొద్ది చాలామంది పెట్రోల్‌ను బాటిళ్లు, డబ్బాల్లో నింపి ఇళ్లలో నిల్వ చేస్తున్నారని, ఇది అత్యంత ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. వేసవిలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటం వల్ల పెట్రోల్ వంటి మండే స్వభావం గల పదార్థాలు ఇళ్లలో ఉంచితే భారీ అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అది ప్రాణనష్టానికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరూ కూడా అవసరానికి మించి ఇంధనాన్ని కొనుగోలు చేయవద్దని, బంకుల్లో ఎప్పుడూ నిల్వలు అందుబాటులో ఉంటాయని ఆయన హామీ ఇచ్చారు.

పరిశ్రమలు, పెద్ద కంపెనీల వంటి బల్క్ వినియోగదారులు రిటైల్ పెట్రోల్ బంకుల వద్ద కొనుగోలు చేయడం వల్ల సాధారణ వినియోగదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని కిషన్ రెడ్డి గుర్తించారు. ఇండస్ట్రీస్ నేరుగా ఆయిల్ కంపెనీలకు ఇండెంట్ ఇవ్వాలని, 24 గంటల్లోనే వారికి సరఫరా చేసేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని వెల్లడించారు. బల్క్ వినియోగదారులు కూడా బంకుల వద్ద క్యూలో నిలబడటం వల్ల సామాన్య ప్రజలకు ఇబ్బంది కలుగుతోందని, ఈ విషయంలో కంపెనీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఆటో ఎల్పీజీ విషయంలో కూడా ప్రభుత్వ రంగ సంస్థల వద్ద సరిపడా నిల్వలు ఉన్నాయని, ప్రైవేట్ సరఫరాదారుల వద్ద ఉన్న చిన్నపాటి సమస్యలను త్వరలోనే తొలగిస్తామని ఆయన చెప్పారు.

చమురు సరఫరా పరిస్థితిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరియు ఆయిల్ కంపెనీలు సమన్వయంతో పర్యవేక్షిస్తున్నాయని కిషన్ రెడ్డి తెలిపారు. ఏదైనా సమస్య తలెత్తితే ప్రజలు నేరుగా అధికారిక హెల్ప్‌లైన్ నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. తప్పుడు వార్తలు ప్రచారం చేస్తూ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల వేళ లేదా రాజకీయ లబ్ధి కోసం ఇంధన సరఫరాపై దుష్ప్రచారం చేయడం దేశ ప్రయోజనాలకు విరుద్ధమని హితవు పలికారు. దేశంలో చమురు నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ప్రతి ఒక్కరికీ అవసరమైనంత ఇంధనం అందుబాటులో ఉంటుందని భరోసా ఇస్తూ తన ప్రసంగాన్ని ముగించారు.

# సలాం సన్‌రైజర్స్

## ముంబైపై సంచలన ఛేజింగ్ విజయం



**ముంబై, మహా:** ఐపీఎల్‌లో మరోసారి పరుగుల సునామీ సృష్టించిన సన్‌రైజర్స్ హైదరాబాద్, ముంబై ఇండియన్స్‌పై చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో ముంబై నిర్దేశించిన 244 పరుగుల భారీ లక్ష్యాన్ని కేవలం 18.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ సృష్టించిన విధ్వంసానికి, హెన్రిచ్ క్లాసెన్, సలీల్ అరోరా మెరుపులు తోడవడంతో సన్‌రైజర్స్ 8 బంతులు మిగిలి ఉండగానే 6 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని అందుకుంది. ముంబై బ్యాటర్ రియాన్ రికెల్టన్ అద్భుత శతకం వృథా అయింది. 244 పరుగుల కొండంత లక్ష్యంతో బరిలోకి దిగిన సన్‌రైజర్స్‌కు ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ తిరుగులేని ఆరంభాన్ని అందించారు. తొలి బంతి నుంచే ముంబై బౌలర్లపై ఎదురుదాడికి దిగిన ఈ జోడీ, పవర్‌ప్లేలోనే స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. వీరిద్దరూ కలిసి కేవలం 8.4 ఓవర్లలోనే 129 పరుగుల విధ్వంసకర భాగస్వామ్యం నెలకొల్పి గెలుపునకు బలమైన పునాది వేశారు. ట్రావిస్ హెడ్ కేవలం 30 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్సర్లతో 76 పరుగులు చేయగా, అభిషేక్ శర్మ 24 బంతుల్లో 3 సిక్సర్లు, 5 ఫోర్లతో 45 పరుగులు సాధించి అతనికి అండగా నిలిచాడు. అయితే, 129 పరుగుల వద్ద అభిషేక్ శర్మ ఔటైన తర్వాత, సన్‌రైజర్స్ స్వల్ప వ్యవధిలో ఇషాన్ కిషన్ (0), ట్రావిస్ హెడ్ వికెట్లను కోల్పోయి కాస్త తడబడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన హెన్రిచ్ క్లాసెన్ (30 బంతుల్లో 65 నాటౌట్), నితీశ్ కుమార్ రెడ్డి (17 బంతుల్లో 21)తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. క్లాసెన్ తనదైన శైలిలో బౌండరీలు బాదుతూ స్కోరు వేగాన్ని తగ్గకుండా చూసుకున్నాడు. నితీశ్ ఔటయ్యాక, కీలక సమయంలో క్రీజులోకి వచ్చిన యువ బ్యాటర్ సలీల్ అరోరా తన సత్తా చాటాడు. కేవలం 10 బంతుల్లో 1 ఫోర్, 3 భారీ సిక్సర్లతో 30 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ముఖ్యంగా అతను బాదిన సిక్సర్లు మ్యాచ్‌ను ఎస్ఆర్‌హెచ్ వైపు పూర్తిగా తిప్పేశాయి. హార్దిక్ పాండ్యా విసిరిన ఇన్నింగ్స్ 19వ ఓవర్లో సలీల్ అరోరా ఒక ఫోర్, రెండు సిక్సర్లు బాదడంతో సన్‌రైజర్స్ విజయతీరాలకు చేరింది.

# ఇద్దరు హెడ్ కానిస్టేబుల్స్, ఒక కానిస్టేబుళ్ సస్పెండ్

**ఉత్తర్వులు జారీ చేసిన వరంగల్ సీపి**

**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు హెడ్ కానిస్టేబుల్స్, ఒక కానిస్టేబుల్ ను సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ శాఖ నిబంధనలకు వ్యతిరేకంగా వడ్డీ వ్యాపారం నిర్వహిస్తూ, డబ్బు ఇవ్వని వారి ఇంటి పై దాడికి పాల్పడినందుకు గాను ఏఆర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ యం. యాదగిరి సస్పెండ్ కాగా, హసన్ పర్తి పోలీస్ స్టేషన్ లో మద్యం సేవించి నైట్ ఇంచార్జ్ విధులు నిర్వహించినందుకు హెడ్ కానిస్టేబుల్ టి. రాములు సస్పెండ్ అయ్యారు. అలాగే స్టేషన్ అధికారి ఇచ్చిన ఆదేశాలను అతిక్రమిస్తున్నందుకు గాను చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ కు చెందిన ఒ సతీష్ ను సస్పెండ్ చేస్తూ బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

# రాష్ట్ర వ్యాప్తంగా 35 మంది ఇన్స్పెక్టర్లకు పదోన్నతులు

## వరంగల్ కమిషనరేట్ లో ముగ్గురు ఇన్స్ స్పెక్టర్లకు డిఎస్పీలుగా పదోన్నతులు







**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ముగ్గురు ఇన్స్పెక్టర్లకు డిఎస్పీ దిగా పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతి పొందిన వారిలో హనుమకొండ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ గా పనిచేస్తున్న గొర్ల సీతారెడ్డి, టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ సార్ల రాజు, ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ ఇన్స్పెక్టర్ బోలగాని శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 35 మంది ఇన్స్పెక్టర్ లకు డిఎస్పీలుగా పదోన్నతి లభించింది.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం

**ఇనగాల వెంకట్రామ్ రెడ్డి నివాసంలో శివసేన రెడ్డి భేటీ**



**మహా వరంగల్ బ్యూరో ;** తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్, వనపర్తి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కే. శివసేన రెడ్డి బుధవారం హనుమకొండ లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ముఖ్యంగా ఈ భేటీ రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. దాదాపు గంటకు పైగా జరిగిన సమావేశంలో ఇరువురు నేతలు పలు కీలక అంశాల పై చర్చించారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న క్రమంలో, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలనే విషయం పై వారు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. హనుమకొండ జిల్లాలో ఉన్న క్రీడా మైదానాల అభివృద్ధి, గ్రామీణ క్రీడాకారులకు ప్రాధాన్యత కల్పించే విషయంపై స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ హోదాలో శివసేన రెడ్డి సానుకూలంగా స్పందించారు. పార్టీ కోసం మొదటి నుంచి పోరాడుతున్న కార్యకర్తలకు ప్రభుత్వంలో అలాగే పార్టీలో గుర్తింపు దక్కేలా చూడాలని కూలంకషంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ పింగిలి వెంకట్రామ్ నర్సింహా రెడ్డి , జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో పదవ విద్యార్థుల ప్రభంజనం




**మహా వరంగల్ బ్యూరో;** ఉత్తమ విద్య తో పాటు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తూ విద్యార్థులను అన్ని రంగాల్లో అభివృద్ధి పథం వైపు నడిపిస్తున్న కృష్ణవేణి టాలెంటెడ్ స్కూల్ దేశాయిపేట్ బ్రాంచ్ లో పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా పదవ తరగతి ఫలితాల్లో స్కూల్ ఉత్తమ ర్యాంక్ సాధించిన ఈద హరిణి 574 సాధించి స్కూల్ ఫస్ట్ రాగా మరొక విద్యార్థిని అన్నా ప్రణతి 568 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి టాలెంట్ స్కూల్స్ చైర్మన్ వట్నాల శ్రీనివాస్ తో పాటు డీన్ పి. కళ్యాణ్ రామ్, ప్రిన్సిపల్ బైరి సత్యనారాయణ విద్యార్థినిలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దేశాయిపేట బ్రాంచ్ స్కూల్ ఆవరణలో టపాసులు పేల్చి మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ముఖ్యంగా నగరంలో ఉన్న బ్రాంచ్లో కెల్లా వరంగల్ దేశాయి పేట బ్రాంచ్ పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించడం విశేషం.

# వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో మెగా హెల్త్ క్యాంపు



**మహా వరంగల్ బ్యూరో;** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాల మేరకు జిల్లా కలెక్టరేట్ లో బుధవారం మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాల కాకతీయ మెడికల్ కాలేజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.కలెక్టరేట్ లో పనిచేస్తున్న జిల్లా రెవెన్యూ అధికారులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి ఈ హెల్త్ క్యాంపులో సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.ముఖ్యంగా ఈసీజీ, రక్తపరీక్షలు, షుగర్, బీపీ తదితర పరీక్షలు చేసి వారి ఆరోగ్య స్థితిని వైద్యులు పరిశీలించారు.ప్రభుత్వ సేవలు సమర్థవంతంగా అందించాలంటే అధికారుల ఆరోగ్యం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా అధికారులు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదన కలెక్టర్ రెవెన్యూ సంధ్యా రాణి, విజయం సూపర్డెంట్ హరిచంద్ర రెడ్డి వైద్య బృందం, జిల్లా అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# తూర్పులో కార్పొరేషన్ ఎన్నికల వేడి

- ఎమ్మెల్సీ సారయ్య వరుస తేనీటి విందులు
- కాంగ్రెస్ సీనియర్ నేతలు, నాయకులు కార్యకర్తల తో భేటీ



**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ తూర్పు నియోజకవర్గంలో మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తూర్పులో కొండా దంపతులకు చెక్ పెట్టే విధంగా తనదైన శైలిలో వ్యూహాలు రచిస్తూ రాజకీయంగా తన ఉనికిని చాటుకునేందుకు పావులు కదుపుతున్నాడు. వరంగల్ తూర్పు కాంగ్రెస్ లో అసంతృప్తితో ఉన్న సీనియర్ నాయకులు, కార్యకర్తలకు నేనున్నానని భరోసాను కల్పిస్తూనే ఇటీవల కాలంలో కొండా వర్గం లోని కొంతమంది నేతలే కొండా వర్గీయులను ఇబ్బందులకు గురి చేస్తూ అక్రమ కేసులు పెడుతున్న వారిని ఆదుకుంటూ వారికి అండగా నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కాంగ్రెస్ సీనియర్ నేతలు, ముఖ్య నాయకులు కార్యకర్తలతో వరుసగా తినేటి విందు కార్యక్రమాలు నిర్వహించడం రాజకీయంగా చర్చనీయాంశం అయ్యింది. ముఖ్యంగా గ్రేటర్ వరంగల్ లో రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలే లక్ష్యంగా ఈ తినేటి విందులు నిర్వహించడం ఎన్నికలకు ముందస్తు వేడి మొదలైందని ఈ సమావేశాలే రుజువు చేస్తున్నాయి. అంతేకాకుండా కొండా అనుచర వర్గాన్ని తన వైపుకు తిప్పుకొని కాంగ్రెస్ శ్రేణుల మధ్య సమన్వయం, ఆత్మీయతను పెంపొందించే దిశగా బుధవారం ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఆధ్వర్యంలో 'తేనీటి విందు' కార్యక్రమం ఘనంగా జరిగింది. వరంగల్ బస్ స్టేషన్ పరిధిలోని రాంకీ ఎంక్లేవ్లో గల వరంగల్ ఈస్ట్ అసెంబ్లీ ప్రెసిడెంట్ ఎండి. సలీం నివాసంలో ఈ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్సీ బసవ రాజు సారయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి తేనీరు సేవిస్తూ స్థానిక సమస్యలు, పార్టీ బలోపేతం పై కూలంకషంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత టీపీసీసీ డెలిగేట్ మెంబర్ నల్గొండ రమేష్, 20వ డివిజన్ సీనియర్ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్, కార్పొరేటర్ బసవరాజు శిరీష శ్రీమాన్, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు, కార్యకర్తల మధ్య అనుబంధాన్ని పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు. తూర్పు నియోజకవర్గ అభివృద్ధిలో ప్రతి కార్యకర్త భాగస్వామ్యం కావాలని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సారయ్య పిలుపునిచ్చారు.

# మైనారిటీ గురుకుల పాఠశాలలో అవగాహన కార్యక్రమం

**పలు అంశాల పై విద్యార్థులకు సూచనలు చేసిన జిల్లా కలెక్టర్**

**మహా వరంగల్ బ్యూరో ;** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వరంగల్ జిల్లాలోని 37వ డివిజన్ పరిధిలో ఉన్న తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాలలో చైల్డ్ సేఫ్టీ, నో డ్రగ్స్", సైబర్ క్రైమ్ తో పాటు టీనేజ్ ప్రెగ్నెన్సీ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, పిల్లలు ముఖ్యంగా అమ్మాయిలు భద్రత విషయంలో ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తప్ప ఇతరులను నమ్మకూడదని, అపరిచితులు ఏవైనా ఆశలు చూపినా, బహుమతులు ఇచ్చిన స్వీకరించకూడదని స్పష్టం చేశారు.అలాగే ఎవరైనా అనుమానాస్పదంగా వ్యవహరిస్తే వెంటనే తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. పిల్లలు ఎక్కడికైనా వెళ్లేటప్పుడు తప్పనిసరిగా పెద్దలకు సమాచారం ఇచ్చి వెళ్లాలని తెలిపారు.అమ్మాయిలు ఉన్నత విద్యను అభ్యసించి, సమాజం పై అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు. టీనేజ్ ప్రెగ్నెన్సీ వంటి సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ , జి సంధ్యారాణి, అదనపు కలెక్టర్లోకల్ బాడీ వై వి గణేష్, సంబంధిత శాఖల అధికారులు అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# దేవాదాయ శాఖలో అధికారి అవినీతి, అధికార దుర్వినియోగం

## అధికారి రామల సునీత అవినీతి బాగోతం పై ఆర్ హెచ్పి గరం.. రాష్ట్రీయ హిందూ పరిషత్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మండల భూపాల్




**మహా వరంగల్ బ్యూరో;** దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత అధికార దుర్వినియోగం, పరిపాలన నిర్లక్ష్యం,అవినీతి, దేవాలయ భూముల ఆక్రమణల పై ఆర్ హెచ్పి దేవాలయ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు చీకటి రాజు అధ్యక్షతన గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ హిందూ పరిషత్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మండల భూపాల్ మాట్లాడుతూ దేవాదాయ శాఖలో జరిగిన అవినీతి, ఆలయ భూముల కబ్జాలు వంటి పలు అంశాలను లేవనేత్తడం జరిగింది. అందులో ముఖ్యంగా మెట్టుగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం సర్వేనెంబర్ 1079 / ఎ లో ఎ 1.33 గుంటలు రామల సునీత మామ కుమ్మరి సారయ్య పేరుతో కబ్జా, మెట్టుగుట్ట శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం సర్వే నెంబర్ 1075 లో 4 ఎకరాల భూమి పై ఫిర్యాదులు చేస్తే కబ్జాదారులు అధికారి అబ్జా పై ప్రశ్నించలేదు మా దగ్గరికి వస్తున్నారా అంటూ విమర్శించారు, మెట్టుగుట్ట శివాలయం 14 కిలోల వెండి మాయం పై కూడా ఎటువంటి విచారణ గాని , చర్యలు గాని తీసుకోకపోవడం , భద్రకాళి దేవస్థానంలో వాహనాల పూజా టికెట్ల అక్రమల పై అసలు దోషి పై ఎటువంటి విచారణ చేపట్టలేదని నామమాత్రంగా కిందిస్థాయి ఉద్యోగుల పై సస్పెన్షన్ వేటు వేశారని భద్రకాళి దేవస్థానంలో పులిహోర కుంభకోణం పై ఎటువంటి విచారణ లేదని భద్రకాళి దేవస్థానంలో ప్రముఖ వ్యక్తి 13 తులాల బంగారు ఆభరణం కాజేసే విషయం పై ఎటువంటి విచారణ చేపట్టలేదని అలాగే ఒక భక్తుడు ఏటా ఇచ్చే విరాళము 1,50,000 కాజేత పై ఎటువంటి విచారణ చేయలేదని ఆరోపించారు. అప్పటి ఈవో శేషు భారతి ప్రోటోకాల్ కండువాల ఖర్చు పై 56 లక్షలు అవకతవకలు చేయడం పై కూడా ఎటువంటి విచారణ చేయలేదు. శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఉద్యోగిని నిబంధనలకు విరుద్ధంగా కార్ డ్రైవర్ గా నియమించు కోవడం పై కూడా వివరణ ఇవ్వాలని ముఖ్యంగా అన్య మతస్తులను వరంగల్ ఎండోమెంట్ పాలసీకి విరుద్ధంగా కార్యాలయంలో నియమించుకున్న ఆధారాలు సమర్పించిన ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. అంతేకాకుండా నిబంధనలకు విరుద్ధంగా భద్రకాళి దేవస్థానం వంశపారంపరమైన హక్కును పొందిన డాక్టర్ శివ సుబ్రహ్మణ్యం పై ఎటువంటి విచారణ చేయకపోవడం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు దేవాలయాల్లో ఉన్న పూజ కైంకర్యాలలోని లోపాలు, అవినీతి, పలు దేవాలయ భూముల ఆక్రమణల పై పలు ఫిర్యాదులు చేసినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించడం , కింది స్థాయి ఉద్యోగులకు అవినీతికి ప్రోద్బలంగా వ్యవహరిస్తున్నట్టు అనిపిస్తుందని వీరి నిర్లక్ష్యం వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో వందల ఎకరాల దేవస్థానముల భూములు కబ్జా అయినవి , దేవాదాయ శాఖలో ఉన్నత అధికారిగా ఆమె పూర్తిగా విఫలం అయ్యిందని, ఇంచార్జ్ వరంగల్ డిప్యూటీ కమిషనర్ గా, అసిస్టెంట్ కమిషనర్ గా, భద్రకాళి దేవాలయ ఈఓ గా ఆమె అనర్హురాలు అని ప్రభుత్వం ఆమె పై శాఖ పరమైన చర్యలు తీసుకుంటూ వెంటనే ఆమెను విధుల్లో నుంచి బర్తరఫ్ చేయాలని రాష్ట్రీయ హిందూ పరిషత్ తరుపున మేము డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కొడారి రాజు, దేవాలయ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు చీకటి రాజుగారు, గోరక్షక్ నేషనల్ ప్రెసిడెంట్ గిరిదారిలాల్ , ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ పల్లపు అశోక్ , రాష్ట్ర కార్యదర్శి కలకోట శ్రీధర్, హనుమకొండ పూర్వ అధ్యక్షులు ఆకుల సంతోష్ కుమార్, ఖిలా వరంగల్ మండల అధ్యక్షులు జంగం ఈశ్వర శివప్రసాద్, కొండ్ర మనోజ్, ముక్క స్వామి, వక్కల మనోహర్, మదన్ మోహన్ యాదవ్, అన్వేష్, సదానందం చారి, లక్ష్మణ్, శ్రీకాంత్, వంశీ తదితర సభ్యులు పాల్గొన్నారు.

## 2025 రిటైర్డ్ ఉద్యోగులకు

# ప్రభుత్వం ఊరట

- బకాయిల చెల్లింపులకు వేయి కోట్లు విడుదల
- ఉత్తర్వులు జారీ చేసిన ఆర్థిక శాఖ

**మహా వరంగల్ బ్యూరో;** తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల నుంచి ప్రభుత్వం పై పెరుగుతున్న ఒత్తిడి అలాగే దీర్ఘకాలిక నిరీక్షణకు తెరదించుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం తీపి కబురు ను అందించింది. గత కేబినెట్ నిర్ణయం మేరకు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల బకాయిల చెల్లింపు కోసం రూ. 1000 కోట్లను విడుదల చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఈ నిధులను యుద్ధ ప్రాతిపదికన కేటాయించారు. గతంలో ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ప్రతి నెలా రూ. 700 కోట్లు విడుదల చేస్తూ వస్తోంది. అయితే, ఉద్యోగుల ఆర్థిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ఆ మొత్తాన్ని రూ.1000 కోట్లకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తాజాగా విడుదల చేసిన నిధులతో 2025 అక్టోబర్ వరకు పెండింగ్లో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల జీపీఎఫ్, ఇతర పదవీ విరమణ బకాయిలన్నీ క్లియర్ అయ్యాయి.

### మెడికల్ బిల్లుల పై ప్రత్యేక దృష్టి

రిటైర్డ్ ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు పెద్దపీట వేస్తూ, మెడికల్ బిల్లుల చెల్లింపులో ఒక్క రోజు కూడా జాప్యం జరగకూడదని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ప్రస్తుతం మెడికల్ బిల్లుల చెల్లింపు ప్రక్రియ అత్యంత వేగంగా, ఎప్పటికప్పుడు సాగుతోంది.

### ప్రభుత్వ ఉద్యోగ సంఘాల హర్షం

ప్రభుత్వ ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులను గుర్తించి, బకాయిల విడుదల మొత్తాన్ని వెయ్యి కోట్లకు పెంచినందుకు ఉద్యోగ సంఘాలు ప్రభుత్వంపై మరియు ముఖ్యంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కపై హర్షం వ్యక్తం చేశాయి. మిగిలిన బకాయిలను కూడా త్వరలోనే ఇదే తరహాలో విడుదల చేస్తామని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. వేలాది మంది సీనియర్ సిటిజన్లకు ప్రభుత్వ నిర్ణయం గొప్ప ఊరటనిచ్చిందని చెప్పుకోవచ్చు.

# న్యాయవాది నుంచి డిజిపి వరకు
# ధైర్యం.. నిబద్ధతకు మారుపేరు శివధర్ రెడ్డి

**ఆయన ప్రస్థానం పోలీస్ శాఖలోనే ఆదర్శనీయం.. మూడు దశాబ్దాలకు పైగా విధులు..
అనేక సంస్కరణలకు బీజం.. నేడు పదవి విరమణ చేయనున్న డిజిపి బత్తుల శివధర్ రెడ్డి**



రాష్ట్ర పోలీస్ వ్యవస్థను అత్యాధునిక దిశగా నడిపించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ పేరిట ప్రజలకు మరింత చేరువయ్యేలా చేశారు. సమర్థవంతమైన విధులు నిర్వర్తించి తనదైన ముద్ర చాటుకున్నారు. ఆ అరుదైన నాయకత్వానికి ప్రతీకగా నిలిచిన వారు డిజిపి బత్తుల శివధర్ రెడ్డి. బాధ్యతలు స్వీకరించిన తక్కువ కాలంలోనే పోలీస్ శాఖలో మార్పులకు నాంది పలికారు. అనేక సంస్కరణలు తీసుకొచ్చి డైనమిక్ ఆఫీసర్‌గా గుర్తింపు పొందారు. అత్యుత్తమ సేవలకు సేవలకు అనేక అవార్డులు అందుకున్నారు. మూడు దశాబ్దాలకు పైగా పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో డీజీపీ వరకు పని చేసి మంచి గుర్తింపు సాధించారు. నేడు డిజిపి పదవి విరమణ చేస్తున్న సందర్భంగా ప్రత్యేక కథనం.. గత సంవత్సరం అక్టోబర్ 1న డిజిపిగా బాధ్యతలు చేపట్టిన ఆయన, పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా మార్చేందుకు సాంకేతికత, పారదర్శకత, ప్రజా సేవల మెరుగుదల అనే మూడు సూత్రాలను అమలు చేశారు. ఫ్రెండ్లీ పోలీసింగ్, వేగవంతమైన స్పందన, ప్రజలకు చేరువైన వ్యవస్థ.. ఇవి ఆయన పాలనలో ప్రధాన లక్షణాలుగా నిలిచాయి. 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారిగా సేవలు ప్రారంభించిన శివధర్ రెడ్డి, ప్రతి దశలో తన సమర్థతను చాటుకున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలి ఇంటెలిజెన్స్ చీఫ్‌గా కీలక బాధ్యతలు చేపట్టి (20142016), రాష్ట్ర భద్రతా వ్యవస్థకు బలమైన పునాది వేశారు. 2023లో తిరిగి ఇంటెలిజెన్స్ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించి, 2024 ఆగస్టులో డిజిపి హోదాకు పదోన్నతి పొందారు.

### న్యాయవాది నుంచి ఐపీఎస్... అసాధారణ ప్రయాణం

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం తులేకలన్ (పెద్ద తుండ్ల)గ్రామానికి చెందిన శివధర్ రెడ్డి, సాధారణ రైతు కుటుంబంలో జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎల్.ఎల్.బి పూర్తి చేసి కొంతకాలం న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. అనంతరం సివిల్స్‌లో విజయం సాధించి ఐపీఎస్‌గా సేవలు ప్రారంభించారు. ఆయన జీవిత ప్రయాణం పట్టుదల, కృషి, లక్ష్యసాధనకు నిదర్శనం.

### మూడు దశాబ్దాలకు పైగా సేవలు.. కీలక బాధ్యతలు

మూడున్నర దశాబ్దాల కెరీర్‌లో అనేక కీలక బాధ్యతలు నిర్వహించారు. అనకాపల్లి ఏఎస్పీ నుంచి నల్గొండ ఎస్పీ వరకు, గ్రేహౌండ్స్, ఎస్ఐబీ, ఏసీబీ వంటి విభాగాల్లో పనిచేశారు. విశాఖపట్నం పోలీస్ కమిషనర్‌గా కూడా సేవలందించారు. ప్రతి బాధ్యతలో సమర్థత, క్రమశిక్షణ, నాయకత్వం ప్రదర్శించారు.

### సంక్షోభాల్లో ధైర్యం.. ప్రజల్లో విశ్వాసం..

2007 మక్కా మసీదు పేలుళ్ల తర్వాత ఉద్రిక్త పరిస్థితుల్లో హైదరాబాద్ సౌత్ జోన్ డీసీపీగా బాధ్యతలు చేపట్టి, శాంతి భద్రతలను కాపాడడంలో కీలక పాత్ర పోషించారు. నయీమ్ ఎన్కౌంటర్ ఆపరేషన్‌లో కీలక ప్రణాళికలో ముందుండి పనిచేసి, బాధితుల ప్రశంసలు అందుకున్నారు.

### అంతర్జాతీయ స్థాయిలో సేవలు

2003లో ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక దళంలో భాగంగా కొసావోలో సేవలందించడం ఆయన ప్రతిభకు అంతర్జాతీయ గుర్తింపు. ఈ అనుభవం ఆయనలో వ్యూహాత్మక దృష్టిని మరింత పదిలం చేసింది.

### పురస్కారాలు – గుర్తింపులు

అత్యుత్తమ సేవలకు గానూ గ్యాలంట్రీ మెడల్, ప్రెసిడెంట్ మెడల్, పోలీస్ మెడల్, యునైటెడ్ నేషన్స్ మెడల్ వంటి అనేక ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకున్నారు. విధుల పట్ల ఆయన నిబద్ధతకు ఇవి నిదర్శనం.

### సిబ్బందికి అండగా ప్రజలకు భరోసాగా

డిజిపిగా బాధ్యతలు చేపట్టిన తరువాత కింది స్థాయి సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. శాఖలో ఉత్సాహాన్ని పెంచుతూ, పై స్థాయి అధికారులతో సమన్వయం పెంచారు. ప్రజలతో పోలీసుల మధ్య దూరాన్ని తగ్గించి, విశ్వాసాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషించారు. నేడు డిజిపి శివధర్ రెడ్డి పదవి విరమణ చేయనున్నారు. మూడు దశాబ్దాల పాటు శాంతి భద్రతల పరిరక్షణలో ఆయన చూపిన ట్రాక్ రికార్డ్ పోలీస్ శాఖ చరిత్రలో మైలురాయిగా నిలిచిపోతుంది.

### పోలీసుల సంక్షేమానికి ప్రత్యేక కృషి..

తెలంగాణ పోలీసు శాఖలో పనిచేస్తున్న సిబ్బంది సంక్షేమానికి డీజీపీ శివధర్ రెడ్డి ప్రత్యేకంగా కృషి చేశారు. పోలీసుల సంక్షేమాన్ని ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటూ, ప్రతి పోలీసు ఉద్యోగికి వారి పుట్టినరోజు వివాహ వార్షికోత్సవం రోజున ప్రత్యేక సెలవు మంజూరు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసులు తమ విధుల్లో తీవ్ర ఒత్తిడిలో పనిచేస్తూ, కుటుంబానికి తగిన సమయం కేటాయించలేకపోతున్న పరిస్థితిని గుర్తించిన డీజీపీ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రత్యేక సెలవుల ద్వారా పోలీసుల మానసిక ఉల్లాసం పెరగడంతో పాటు, కుటుంబ బంధాలు మరింత బలోపేతం అవుతాయని ఆయన ఆలోచన చేశారు

### మావోయిస్టు నేతల లొంగుబాటులోను చొరవ

రాష్ట్రంలో మావోయిస్టు నేతల లొంగుబాటుకు డీజీపీ బి. శివధర్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపారు పోలీసు శాఖలో ఆయన తీసుకున్న వ్యూహాత్మక చర్యలు, సమన్వయంతో కూడిన ఆపరేషన్లు మావోయిస్టు కార్యకలాపాలపై ప్రభావం చూపుతూ, వారిని జనజీవన స్రవంతిలోకి తీసుకురావడంలో కీలకంగా పనిచేశాయి లొంగుబాటుకు ముందుకు వచ్చే మావోయిస్టులకు భద్రతా హామీలు, పునరావాస సదుపాయాలు, ఉపాధి అవకాశాలు కల్పించడంలోప్రత్యేక దృష్టి సారించారు

### 'అరైవ్ అలైవ్ సత్ఫలితాలు..

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సమగ్ర దృక్పథంతో ప్రారంభించిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమం రాష్ట్రంలో సానుకూల ఫలితాలను ఇస్తోంది. ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపు, సేఫ్ డ్రైవింగ్ అలవాట్లను ప్రోత్సహించడం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై హెచ్చరికలు ఇవ్వడం వంటి చర్యల ద్వారా ఈ కార్యక్రమం ప్రభావవంతంగా ముందుకు సాగుతోంది. డీజీపీ బి. శివధర్ రెడ్డి ఆలోచనతో పుట్టిన ఈ వినూత్న కార్యక్రమం, కేవలం అవగాహనకే పరిమితం కాకుండా, ప్రాణాలను కాపాడే దిశగా కార్యాచరణాత్మకంగా అమలవుతోంది. ముఖ్యంగా యువతలో రోడ్డు భద్రతపై చైతన్యం పెంచుతూ, హెల్మెట్ వినియోగం, సీట్ బెల్ట్ ధరించడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయకుండా ఉండటం వంటి కీలక అంశాలపై దృష్టి సారిస్తోంది. దీంతో రోడ్డు ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించడమే కాకుండా, ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యానికి చేరుకునేలా చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా నిలుస్తోంది. మొత్తానికి, 'అరైవ్ అలైవ్' కార్యక్రమం రోడ్డు భద్రతలో ఒక కొత్త దిశను చూపిస్తూ, సమాజంలో బాధ్యతాయుత డ్రైవింగ్ సంస్కృతి సంపాదించడానికి ప్రధాన కారణమైంది. మొత్తం మీద, డిజిపి శివధర్ రెడ్డి నాయకత్వంలో పోలీస్ శాఖ నూతన పంథాలో పయనించింది. ఆయన తీసుకువచ్చిన సంస్కరణలు, చూపిన నాయకత్వం భవిష్యత్ పోలీసింగ్‌కు మార్గదర్శకంగా నిలుస్తాయి. ధైర్యం, నిబద్ధత, సేవా..సమ్మేళనం కేరాఫ్ అడ్రస్ శివధర్ రెడ్డి..



- గొట్టిముక్కుల బ్రహ్మాచారి
సీనియర్ జర్నలిస్ట్, 9441884389

# 'క్యాన్సర్' ముప్పు తప్పదు!



క్యాన్సర్ మహమ్మారి నిశ్శబ్దంగా శరీరాన్ని ఆక్రమిస్తుంది. భారతదేశంలో సాధారణంగా కనిపించే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, ఊపిరితిత్తులు, నోటి మరియు రొమ్ము క్యాన్సర్లు ప్రారంభ దశలో చాలా స్వల్ప లక్షణాలను కలిగి ఉంటాయి. వీటిని మనం సాధారణ సమస్యలుగా భావించి నిర్లక్ష్యం చేస్తుంటాం. కానీ....వ్యాధి ముదిరిన తర్వాత చికిత్స చేయడం ఎంతో సంక్లిష్టంగా మారుతుంది. అందుకే శరీరంలో కనిపించే చిన్నపాటి మార్పులను కూడా గుర్తించడం చాలా అవసరం.

నోయిడాలోని మెదాంత హాస్పిటల్ సీనియర్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ అంకుర్ నందన్ వర్షనే ఈ విషయంపై కీలక విషయాలను పంచుకున్నారు. "నొప్పి లేకపోవడమే క్యాన్సర్ విషయంలో అతిపెద్ద శాపం. ప్రారంభంలో ఎటువంటి నొప్పి ఉండదు కాబట్టి, రోగులు తమ శరీరంలో వచ్చే చిన్న చిన్న గడ్డలను లేదా మార్పులను సహజంగా తగ్గిపోతాయని భావించి వదిలేస్తారు. తీరా అది ముదిరిన తర్వాత వైద్యులను సంప్రదిస్తే, పరిస్థితి చేయి దాటిపోయే ప్రమాదం ఉంటుంది," అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.అందుకే.... ప్రతి ఒక్కరూ 5 ముఖ్యమైన సంకేతాలు గమనించుకోవాలని సూచించారు.....

### 1. నొప్పి లేని గడ్డలు లేదా వాపులు

శరీరంలో ఎక్కడైనా, ముఖ్యంగా రొమ్ము, మెడ, చంకలు లేదా వృషణాల్లో అసాధారణంగా గడ్డలు కనిపిస్తే వెంటనే అప్రమత్తం కావాలి. చాలామంది ఈ గడ్డలు నొప్పి పెట్టడం లేదు కదా అని నిర్లక్ష్యం చేస్తారు. కానీ.... అసాధారణ కణాల పెరుగుదల వల్ల వచ్చే గడ్డలు ప్రారంభంలో ఎటువంటి నొప్పిని కలిగించవు. గడ్డ చిన్నదైనా, పెద్దదైనా అది కొత్తగా కనిపిస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలి.

### 2. మానని పుండ్లు

భారత్ లో నోటి క్యాన్సర్ కేసులు అత్యధికంగా నమోదవుతున్నాయి. ముఖ్యంగా పొగాకు వాడే వారిలో ఈ ముప్పు ఎక్కువ. నోటిలో, నాలుకపై లేదా చిగుళ్లపై వచ్చే పుండ్లు రెండు వారాలకు మించి మానకపోతే అది ప్రమాద సంకేతం కావొచ్చు. "నోటిలో పుండు 10 నుండి 14 రోజులలోపు తగ్గకపోతే, అది క్యాన్సర్ ముందస్తు లక్షణం అయ్యే అవకాశం ఉంది," అని డాక్టర్ వర్షనే హెచ్చరించారు.

### 3. అసాధారణ రక్తస్రావం లేదా స్రావాలు

శరీరంలోని ఏ భాగం నుంచైనా కారణం లేకుండా రక్తం రావడం తీవ్రంగా పరిగణించాల్సిన విషయం. నోటి నుంచి, మల విసర్జన సమయంలో, మూత్రంలో లేదా జననేంద్రియాల నుంచి అసాధారణంగా రక్తస్రావం కావడం క్యాన్సర్ లక్షణం కావొచ్చు. మహిళల్లో నెలసరితో సంబంధం లేకుండా అసాధారణ యోని రక్తస్రావం కనిపిస్తే అది సర్వైకల్ (గర్భాశయ ముఖద్వార) క్యాన్సర్‌కు దారి తీయవచ్చు. అలాగే లాలాజలంలో రక్తం పడటం ఊపిరితిత్తుల లేదా గొంతు క్యాన్సర్‌కు సూచన కావొచ్చు.

### 4. తగ్గని దగ్గు....బొంగురు గొంతు

వాతావరణ కాలుష్యం లేదా ఇన్‌ఫెక్షన్ వల్ల దగ్గు రావడం సాధారణమే. కానీ, మూడు వారాలకు మించి దగ్గు తగ్గకపోయినా, గొంతు బొంగురుపోయినా దానిని తేలికగా తీసుకోకూడదు. ముఖ్యంగా ధూమపానం చేసేవారిలో ఇలాంటి లక్షణాలు కనిపిస్తే అవి ఊపిరితిత్తులు, గొంతు లేదా అన్నవాహిక క్యాన్సర్‌కు ప్రాథమిక సంకేతాలు కావచ్చు. మింగడానికి ఇబ్బందిగా ఉన్నా నిపుణులను సంప్రదించాలి.

### 5. అకస్మాత్తుగా బరువు తగ్గడం

ఎటువంటి డైటింగ్ లేదా వ్యాయామం చేయకుండానే అకస్మాత్తుగా బరువు తగ్గిపోవడం మంచి లక్షణం కాదు. అలాగే విశ్రాంతి తీసుకున్నా తగ్గని నిరంతర అలసట కూడా ప్రమాదకరమే. ఇవి రక్తం, ఊపిరితిత్తులు లేదా కడుపుకు సంబంధించిన క్యాన్సర్ల వల్ల వచ్చే అవకాశం ఉంది. వీటిని కేవలం పని ఒత్తిడి లేదా నీరసంగా భావించి కాలయాపన చేయకూడదు.

క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తిస్తే తక్కువ ఖర్చుతో, సులభమైన చికిత్స ద్వారా పూర్తిగా నయం చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. "క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడం అంటే కేవలం వ్యాధిని తెలుసుకోవడం మాత్రమే కాదు...రోగికి మెరుగైన జీవన ప్రమాణాలను మరియు సంపూర్ణ ఆరోగ్య అవకాశాన్ని అందించడం," అని డాక్టర్ వర్షనే స్పష్టం చేశారు.

# ఎగరలేకపోతే పరుగెత్తండి...
# పరుగెత్తలేకపోతే నడవండి

## మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ చెప్పిన జీవన సూత్రం



జీవితం ఎప్పుడూ ఒకేలా సాగదు. కొన్నిసార్లు అనుకున్న పనులు అనుకున్నట్లు జరుగుతాయి, మరికొన్నిసార్లు అన్నీ అడ్డంకులే ఎదురవుతాయి. ముఖ్యంగా కెరీర్‌లోనో, వ్యక్తిగత జీవితంలోనో వైఫల్యం ఎదురైనప్పుడు చాలామంది అక్కడే ఆగిపోతారు. సరిగ్గా ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న వారికే మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ చెప్పిన మాటలు ఒక టానిక్‌లా పనిచేస్తాయి. లక్ష్యాన్ని చేరుకోవడంలో వేగం కంటే నిరంతరం ప్రయత్నించడమే ముఖ్యమని ఆయన చాటిచెప్పారు.

### అసలు ఆ మాటల వెనుక ఉన్న అర్థం ఏంటి?

"మీరు ఎగరలేకపోతే పరుగెత్తండి, పరుగెత్తలేకపోతే నడవండి, నడవలేకపోతే కనీసం పాకండి.. కానీ ఏం చేసినా సరే, మీరు మాత్రం నిరంతరం ముందుకు సాగుతూనే ఉండాలి" అని మార్టిన్ లూథర్ కింగ్ పేర్కొన్నారు. ఈ మాటలు పైకి సాధారణంగా అనిపించినా, వీటిలో లోతైన జీవన తత్వముంది. మన సామర్థ్యం ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఒక్కోసారి మనం ఉత్సాహంతో దూసుకుపోతాం (ఎగరడం), ఒక్కోసారి నెమ్మదిగా పనులు పూర్తి చేస్తాం (పరుగెత్తడం). కానీ పరిస్థితులు బాగోలేనప్పుడు అసలు ఏమీ చేయలేక చతికిలబడిపోతాం. అప్పుడే కింగ్ చెప్పిన 'పాకడం' (Crawl) అనే పదం మనకు స్ఫూర్తినిస్తుంది. అంటే, ఎంతటి కష్ట కాలంలోనైనా సరే, చిన్న ప్రయత్నమైనా చేస్తూ ఉండాలి తప్ప, నిరాశతో ఆగిపోకూడదు.

### సాధారణ పౌరుడి నుంచి ప్రపంచ నేత వరకు..

మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ జీవితమే ఒక పోరాటం. 1929 జనవరి 15న అమెరికాలోని అట్లాంటాలో జన్మించిన ఆయన, అప్పట్లో ఉన్న వర్ణ వివక్షను చిన్నప్పటి నుంచే చూశారు. ఆయన తెలివితేటలు ఎంతటివంటే, కేవలం 15 ఏళ్ల వయసులోనే హైస్కూల్ పూర్తి చేసి మోర్‌హౌస్ కాలేజీలో పట్టభద్రుడయ్యారు. కేవలం మాటలతోనే కాదు, చేతలతోనూ ఆయన వ్యవస్థను ప్రశ్నించారు. అమెరికాలో నల్లజాతీయులపై జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా ఆయన శాంతియుత పోరాటాలు సాగించారు. ఈ క్రమంలో ఆయన ఎన్నోసార్లు జైలుకు వెళ్లారు, ప్రాణాపాయం నుంచి తృటిలో తప్పించుకున్నారు. అయినా సరే, ఆయన తన అడుగును ఆపలేదు. ఫలితంగా 1964లో, కేవలం 35 ఏళ్ల వయసులోనే నోబెల్ శాంతి బహుమతిని అందుకున్న అతి పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించారు.

### పరిపూర్ణత కోసం వేచి చూడొద్దు

**చాలామంది పరిస్థితులు చక్కబడిన తర్వాతే పని మొదలుపెడదామని ఎదురుచూస్తుంటారు. కానీ కింగ్ సిద్ధాంతం ప్రకారం.. మీ దగ్గర ఏముంటే దాంతోనే, మీరున్న స్థితి నుంచే ప్రయాణాన్ని మొదలుపెట్టండి. పర్ఫెక్ట్ టైమ్ కోసం ఎదురుచూస్తూ కూర్చుంటే అసలు ప్రయాణమే మొదలవ్వదు. ఆగిపోవడం అంటే ఓటమిని అంగీకరించడమే. కానీ నెమ్మదిగానైనా కదులుతూ ఉంటే, ఎప్పటికైనా గమ్యాన్ని చేరుతామనే నమ్మకం ఉంటుంది. చివరగా.. విజయం అంటే కేవలం లక్ష్యాన్ని చేరుకోవడం మాత్రమే కాదు, దారిలో ఎదురయ్యే అడ్డంకులను అధిగమిస్తూ ముందుకు సాగడం కూడా. కింగ్ మాటలను మన జీవితంలో అన్వయించుకుంటే, ఏ కష్టమూ మనల్ని ఆపలేదు.**

### నేటి పోటీ ప్రపంచంలో ఈ సూత్రం ఎందుకు ముఖ్యం?

ఈ రోజుల్లో సోషల్ మీడియా ప్రభావం వల్ల ప్రతి ఒక్కరూ తమను ఇతరులతో పోల్చుకుంటున్నారు. పక్కవాడు వేగంగా సక్సెస్ అవుతున్నాడని, మనం వెనుకబడిపోయామని ఒత్తిడికి లోనవుతున్నారు. ఇక్కడే మనం కింగ్ చెప్పిన విషయాన్ని గుర్తుంచుకోవాలి. ప్రగతి అనేది ఒక్క రోజులో వచ్చేది కాదు. మార్పు అనేది నిరంతర శ్రమ వల్ల వచ్చే ఫలితం. అప్పట్లో అమెరికాలో జరిగిన 'మాంట్‌గోమరీ బస్ బాయ్‌కాట్' ఉద్యమం సుమారు 381 రోజుల పాటు సాగింది. అంటే ఒక ఏడాది పైగా ప్రజలు తమ హక్కుల కోసం నడుస్తూనే ఉన్నారు. ఆ నిలకడైన పోరాటమే చివరకు విజయాన్ని తెచ్చిపెట్టింది. మన కెరీర్‌లో కూడా ఒక్కోసారి మనం 'పాకే' స్థితిలో ఉండవచ్చు. కానీ ఆ చిన్న అడుగులే భవిష్యత్తులో పెద్ద విజయాలకు పునాది వేస్తాయని గుర్తుంచుకోవాలి.

## ప్రభుత్వ పాఠశాలలకు ధీటుగా
## ప్రైవేటు పాఠశాలల ప్రభంజనం

- 576 మార్కులతో సెయింట్ మేరీస్ ప్రథమస్థానం
- 571 మార్కులతో నాగుపల్లి జడ్పీహెచ్ఎస్ మండల ద్వితీయ స్థానం
- 568మార్కులతో గీతాంజలి పాఠశాల మండల తృతీయ స్థానం




**దమ్మపేట ,మహా :** 202526 విద్యాసంవత్సరానికి గాను పదవతరగతి పరిక్ష ఫలితాలలో ప్రైవేటు పాఠశాల విద్యార్థి కె.హాపేష్ 600 మార్కులకు గాను 576మార్కులు సాధించి మండల ప్రథమస్థానంలో నిలిచారు. నాగుపల్లి జడ్పీహెచ్ఎస్ కు చెందిన విద్యార్థిని యం.మన్విత 600మార్కులకు గాను 571 సాధించి మండల ద్వితీయ స్థానం లో ఉన్నారు. దమ్మపేట గీతాంజలి పాఠశాల కు చెందిన విద్యార్థి యం.సిద్ధు 568మార్కులు సాధించి మండల తృతీయ స్థానంలో నిలిచారు. అదేవిధంగా మండలంలోని మొత్తం ఫలితాలు పరిశీలిస్తే మండలంలోని 8జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 277మంది విద్యార్థులు పరిక్షలు వ్రాయగా 275మంది ఉత్తీర్ణులైనారు.ఆశ్రమ గిరిజన పాఠశాలలో 438మంది విద్యార్థులు పరిక్షలు వ్రాయగా 438మంది ఉత్తీర్ణులైనారు. 3 ప్రైవేటు పాఠశాలలో 45 మంది విద్యార్థులు పరిక్షలు వ్రాయగా 45మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనారు.కాగా మండలం మొత్తం 99శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం పట్ల పలువురు ఉపాధ్యాయులు గ్రామపెద్దలు ,విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## 10 ఫలితాల్లో శ్రీ రాగా స్కూల్ ప్రభంజనం




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** పదో తరగతి పరీక్ష ఫలితాల్లో శ్రీ రాగా స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి విశేష విజయాన్ని సాధించారని స్కూల్ యాజమాన్యం నిర్వాహకులు మల్లారపు వర ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం ప్రకటన విడుదల చేశారు. బి.అఖిల్-560 మార్కులు, రిషిత్ రాణా- 532 మార్కులు, టీ.హేమంత్ నాయక్-519 మార్కులు, డి.శ్రీ చైతన్య-505 మార్కులు, ఎస్.కె అజ్మల్-500 మార్కులు సాధించారు. బోర్డు పరీక్షకు అటెండ్ అయిన వారు 30 మంది పాస్ అయ్యారు. 100 పర్సెంట్ ఉత్తీర్ణత సాధించినందుకు పాఠశాల డైరెక్టర్ ఎం.కవిత తమ ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఫలితాలు శ్రీ రాగా స్కూల్ యొక్క నాణ్యమైన విద్యా ప్రమాణాలను కృషిని ప్రతిబింబిస్తున్నాయి. టాప్ స్కోర్లు సాధించి పాఠశాల కీర్తి పతాకాన్ని ఎగురవేసిన విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేసారు. ఈ విజయానికి తోడ్పడిన శ్రీ రాగా టీచింగ్ నాన్‌టీచింగ్ సిబ్బందికి, అలాగే తమ పిల్లల విద్యాభివృద్ధికి నిరంతరం సహకరించిన తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరికీ యాజమాన్యం అభినందనలు తెలిపింది.

## మేడే అమరవీరుల స్ఫూర్తితో లేబర్ కోడ్ లు
## రద్దయ్యే వరకు పోరాటాలు ఉధృతం

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భూక్యా రమేష్
- సీఐటీయూ ఆధ్వర్యంలో మే 1 నుండి 7 వరకు ఘనంగా వారోత్సవాలు




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** కొత్తగూడెం పట్టణ వ్యాపితంగా కార్మిక ప్రాంతాల్లో మేడే సందర్భంగా ఘనంగా ఎర్రజెండాలు ఎగురవేయాలని కార్మిక వర్గానికి సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్ పిలుపునిచ్చారు. కొత్తగూడెం మంచికంటి భవన్ లో బుధవారం పట్టణ సీఐటీయూ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఐటియు ఆధ్వర్యంలో మే ఒకటి నుండి ఏడవ తారీఖు వరకు కార్మిక వారోత్సవాలు పని ప్రాంతాల్లో కార్మిక నివాస ప్రాంతాల్లో వాడవాడల ఎర్రజెండా రెపరెపలాడాలని ఆయన పిలుపునిచ్చారు. చికాగో అమరవీరుల స్ఫూర్తితో ఎనిమిది గంటల పని దినాన్ని సాధించుకున్న చరిత్రను ప్రతి కార్మికుడు తెలుసుకోవాలని గత కార్మిక వర్గ పోరాటాల చరిత్రను అధ్యయనం చేసి ప్రజలకు వివరించాలని ఆయన అన్నారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మికులకు వ్యతిరేకంగా విధానాలు అమలు చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలను కార్మికుల్లో ప్రచారం చేయాలని కార్మికులకు పెను ప్రమాదంగా మారిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసే వరకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మేడే స్ఫూర్తితో కార్మిక వర్గం పోరాటాలకు పూనుకోవాలని సూచించారు. ప్రజల్ని కార్మికుల్ని చైతన్యపరిచే ఆట పాటలు మహిళలు ప్రత్యేకమైన కార్యక్రమాలు విద్యార్థులకు యువతకు ఉత్తేజము కలిగేలా అమరవీరుల వారసత్వాన్ని ఉనికిపుచ్చుకునేలా నేటి యువతరాన్ని కార్మికులకు అండగా నిలబడేలా మేడే వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాలకు కార్మికులు కర్షకులు అన్ని వర్గాల ప్రజలు పాల్గొనే విధంగా చేస్తున్నామన్నారు. మతోన్మాద చర్యలకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వ బీజేపీ మోడీ విధానాలను మతోన్మాద విధానాలపై ఈ సభల్లో కార్మిక వర్గ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న పాలకవర్గాలకు బుద్ధి చెప్పేలా మేడే వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యురాలు అంబాలదుర్గమ్మ, సీనియర్ నాయకులు జి రాజారావు, జలాల్, ఎస్ డబ్ల్యూ ఎఫ్ నాయకులు సామ్యూల్, రఫీ, టీ ఎం ఎస్ ఆర్ యు నాయకులు రమేష్, స్కావెంజర్స్ యూనియన్ పట్టణ నాయకులు నిహారిక, శారద తదితరులు పాల్గొన్నారు.

## పదిలో ఉత్తమ ఫలితాలు సాధించిన గీతాంజలి హైస్కూలు

**దమ్మపేట ,మహా :** మండలంలోని 3 ప్రైవేటు పాఠశాల లో స్థానికంగా ఉన్న సెయింట్ మేరీస్ , బోటనీ బాలాజీ, గీతాంజలి పాఠశాల ల విద్యార్థులు 100శాతం ఫలితాలను సాదించి ముందంజలో ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో అన్నీ వసతులు ,సబ్జెక్ట్ ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ ప్రైవేటు పాఠశాలలే ప్రభంజనం సృష్టించాయి. గీతాంజలి లో 19మంది విద్యార్థులు ,బోటనీ బాలాజీ లో 12మంది ,సెయింట్ మేరిస్ లో 14మంది పరిక్షలు వ్రాయగా మొత్తం 45మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనారు. కాగా ఆయా పాఠశాలలో సరాసరి 500మార్కులకు ఎగువున ఉన్నవారే ఉండటంతో పాఠశాల యాజమాన్యాలు సెయింట్ మేరీస్ ఫాదర్ రాజారత్నం ,బోటనీబాలాజీ కరస్పాండెంట్ అనంతరావు ,గీతాంజలి ప్రిన్సిపాల్ మేడిది వెంకటరత్నం ,ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థుల కు శుభాభినందనలు తెలిపారు. అనంతరం విద్యార్థుల కు మిఠాయిలు పంపిణీ చేశారు.

## పంట వ్యర్థాలను కాల్చడం
## భూతల్లికి, పర్యావరణానికి గొడ్డలిపెట్టు

**ఏఓ చంద్రశేఖర్ రెడ్డి**



**దమ్మపేట ,మహా :** మండలంలోని రైతులు వరి కోతల అనంతరం పొలాల్లో మిగిలిన వరి దుబ్బులను, కొయ్యకాళ్లను తగులబెట్టే పద్ధతిని తక్షణమే మానుకోవాలని మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా మండలంలోని నాగుపల్లి, నాచారం, గణేష్‌పాడు, మందలపల్లి, మొద్దులగూడెం, గండుగులపల్లి, ముష్టిబండ మరియు ఇతర గ్రామాల్లో వరి వ్యర్థాలను తగులబెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనివల్ల రైతులకు అపారమైన నష్టం కలుగుతోందని అన్నారు. ఒక ఎకరా పొలంలో దుబ్బులను కాల్చడం వల్ల సుమారు 5 టన్నుల విలువైన సేంద్రియ ఎరువును రైతులు నష్టపోతున్నారని ఆయన వివరించారు. దీనివల్ల నేలలోని హ్యూమస్ తగ్గిపోవడమే కాకుండా, మొక్కకు అవసరమైన నత్రజని, భాస్వరం, పొటాష్ మరియు సల్ఫర్ వంటి పోషకాలు గాలిలో కలిసిపోతాయని తెలిపారు. ఇలా కాల్చడం వల్ల ఎకరాకు సుమారు రూ.3,000 విలువైన ఎరువులను రైతులు వృధా చేసుకుంటున్నారని తెలిపారు. మంటల వేడికి భూమి పైపొరలో ఉండే వానపాములు, మిత్ర పురుగులు మరియు మేలు చేసే సూక్ష్మజీవులు 2.5 సెం.మీ లోతు వరకు చనిపోతాయని, దీనివల్ల నేల గుల్లబారడం తగ్గిపోయి గట్టిగా మారుతుందని తెలిపారు. ఫలితంగా భూమికి నీటిని పీల్చుకునే శక్తి తగ్గిపోతుందని హెచ్చరించారు. అంతేకాకుండా వ్యర్థాలను కాల్చడం వల్ల వెలువడే కార్బన్ మోనాక్సైడ్, మీథేన్ వంటి వాయువుల వల్ల గాలి కాలుష్యమై ఊపిరితిత్తుల వ్యాధులు, ఆస్తమా, కంటి మంటలు వస్తాయని ఏఓ తెలిపారు. రోడ్డు పక్కన పొలాలను కాల్చడం వల్ల వచ్చే పొగతో వాహనదారులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, పర్యావరణానికి గ్లోబల్ వార్మింగ్ ముప్పు పొంచి ఉందని వివరించారు.పంట వ్యర్థాలను కాల్చడానికి బదులు రోటవేటర్ లేదా ఎంబీ ప్లౌతో భూమిలో కలియదున్నాలని సూచించారు. ఐఏఆర్ఐ వారి 'వేస్ట్ డీ కంపోజర్' వాడితే 15 రోజుల్లోనే వ్యర్థాలు కుళ్లిపోయి అద్భుతమైన ఎరువుగా మారుతాయన్నారు. ఇలా చేయడం వల్ల ఎకరాకు 25 కిలోల యూరియా, 12 కిలోల డీఏపీ ఆదా అవ్వడమే కాకుండా, దిగుబడి కూడా 1015 శాతం పెరుగుతుందని రైతులకు సూచించారు.నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనల ప్రకారం పంట వ్యర్థాలను కాల్చడం నేరమని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఎకరా విస్తీర్ణాన్ని బట్టి రూ.2,500 నుండి రూ.15,000 వరకు జరిమానా విధిస్తామని ఆయన హెచ్చరించారు. రైతు సోదరులు నేల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడుకోవాలని కోరారు.

## మృతుని కుటుంబానికి బియ్యం వితరణ



**కారేపల్లి, మహా :** కారేపల్లి మండలం అప్పాయిగూడెంకు చెందిన వట్టం సుధాకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుని కుటుంబానికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అనుచరులు 100 కిలోల బియ్యంను బుధవారం వితరణ చేశారు. బియ్యాన్ని అప్పాయిగూడెం సర్పంచ్ దండు ప్రవీణ్ చేతుల మీదిగా అందజేశారు. ఈకార్యక్రమంలో వట్టం రామారావు, కుంజా వెంకటేశ్వర్లు, పాల్తీయ శివాజీ, భూక్యా రాములు, కుమ్మరి రాములు, ధనలక్ష్మి, జోగయ్య, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ ఆపిల్ ఫోన్స్ ఎయిర్ ఫ్యాడ్స్, ఐ వాచెస్ విక్రయిస్తున్న
## ఘజియాబాద్ కు చెందిన ముఠా అరెస్ట్, ముగ్గురు పరార్




**రాజేంద్రనగర్, మహా :** నకిలీ ఐ ఫోన్స్, ఎయిర్ ప్యాడ్స్, ఐవాచెస్ లు విక్రయిస్తున్న 6 మంది ఘజియాబాద్ కు చెందిన ముఠా సభ్యులను శంషాబాద్ ఆర్జీఐఏ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.కేసు వివరాలను శంషాబాద్ పోలీస్ స్టేషన్లో ఏసిపి శ్రీకాంత్ గౌడ్ వెల్లడించారు.. ఉత్తరప్రదేశ్ ఘజియాబాద్ ప్రాంతానికి చెందిన 9 మంది మహమ్మద్ అనాజ్, మహమ్మద్ ఫార్మన్, మహమ్మద్ అబ్దుల్, మహమ్మద్ జునీద్, మోహిద్ వాసిన్, మహమ్మద్ సోయబ్ కురుషి, ధనుష్ అహ్మద్, మోహిద్ షకీబ్, రవి కమలేష్ గుప్తా, గజియాబాద్ నుండి నకిలీ ఐఫోన్స్, ఇయర్ ఫోన్స్, ఐ వాచెస్ తీసుకొచ్చి హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతంలో అమాయకులకు తక్కువ ధరకే ఆపిల్ ఫోన్స్, ఇయర్ ఫోన్స్, ఐ వాచెస్ ఉన్నాయి అని నమ్మించి విక్రయిస్తారు. అయితే అదే తరహాలో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పహాడీ షరీఫ్, ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలోని కిషన్ గూడా ఆర్ఓబి వద్ద హరినాథ్ వేచి ఉండగా, ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు స్కూటీపై అతని దగ్గరకు వచ్చి తమ వద్ద ఐఫోన్ లో ఎయిర్ ఫ్యాడ్స్, ఐ వాచ్లు తక్కువ ధరకు ఉన్నాయి చెప్పారు. వారి మాటలు నమ్మిన హరినాథ్ 33 వేల రూపాయలు ఆన్లైన్ ద్వారా చెల్లించాడు. మరో వ్యక్తి స్కూటీపై వచ్చి ఒక యాపిల్ ఫోన్ ఆఫర్ చేయగా దానికోసం 18 వేల రూపాయలు ఆన్లైన్ లో చెల్లించాడు. నిందితులు చెప్పిన అసలైన ఐఫోన్లు అతనికి చెల్లించలేదు. ఇంటికి వెళ్లి చూడగా అతని దగ్గర కొన్నవి నకిలీవని తేలింది. తను మోసపోయాడని తెలుసుకుని, దీంతో బాధితుడు పెండం హరినాథ్ ఆర్జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న క్రైమ్ పోలీసులు నిందితులను బుధవారం అరెస్టు చేసి వారి వద్ద రెండు నకిలీ ఆపిల్ మొబైల్ ఫోన్లు ఇయర్ ఫోన్స్, 14 ఆపిల్ వాచెస్ తో పాటు రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. 9 మంది నిందితుల్లో దినేష్ అహ్మద్ మహమ్మద్ రవి కమలేష్ గుప్తా పరారీలో ఉన్నారు.ఆరుగురు నిందితులను రిమాండ్ కు తరలించారు. ఘజియాబాద్ ముఠాను చాకచకంగా వివరించి పట్టుకున్న క్రైమ్ సీఐ పవన్ కుమార్ ను, ఆర్జీఐఏ సిఐలను అభినందించారు.

## సింగరేణి మండల పదిలో నూరు శాతం



**మైనార్టీ గురుకుల విద్యార్థికి 564 మార్కులు**



**కారేపల్లి, మహా :** సింగరేణి మండల విద్యార్థులు పది ఫలితాలలో నూరుశాతం ఫలితాలు సాధించారు. బుధవారం విడుదల చేసిన ఫలితాలలో 14 ప్రభుత్వ, 2 ప్రయివేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు అందరు ఉత్తీర్ణులైనట్లు ఎంఈవో దుగ్గిరాల జయరాజు తెలిపారు. పది పరీక్షలకు 581 మంది విద్యార్థులు హాజరుకాగా అందరు ఉత్తర్ణత సాధించారు. తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యార్థిని ఎండీ.షబానా సుల్తానా 564 మార్కులు సాధించి మండల ఫస్ట్‌గా నిలవగా మోడల్ స్కూల్ విద్యార్థి మండల మీనాక్షి 561, మైనార్టీ గురుకుల విద్యార్థులు వాంకుడోత్ మోహిత 561 మార్కులు సాధించి రెండో స్థానంలో నిలిచారు. తర్వాత స్థానాలలో మోడల్ స్కూల్‌కు చెందిన వలివేటి వీరవెంకట సృజన 560, పొనుగోటి బిందు ప్రియ 558, చింత సుస్మిత 558 నిలిచారు. కేజీబీవీ విద్యార్థిని పొన్నాడ హాసిని 556 మార్కులు సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంఈవో జయరాజు అభినందించారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ రోడ్‌లో జింజర్ హోటల్ ను ప్రారంభించిన
## ఐహెచ్సిఎల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ దీపికారావు



**రాజేంద్రనగర్, మహా ;** భారతదేశంలో అతిపెద్ద హాస్పిటాలిటీ సంస్థ అయిన ఇండియన్ హోటల్స్ కంపెనీ (ఐహెచ్సిఎల్), శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ రోడ్‌లో జింజర్ హోటల్‌ను ప్రతాప్ జడేజా తో కలిసి ఐహెచ్సిఎల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్దీపికారావు ప్రారంభించారు. హైదరాబాద్ నగరంలో తమ బ్రాండ్ ప్రవేశించినట్లు వెల్లడించారు. ఐహెచ్సిఎల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ దీపికా రావు మాట్లాడుతూ ఫైనాన్షియల్ సర్వీసెస్, టెక్నాలజీ, మాన్యుఫ్యాక్చరింగ్, మెడికల్ టూరిజం, విద్య రంగాలతో పాటుగా ఒక సుస్థిరమైన సాంస్కృతిక వినియోగదారులు ఉన్న హైదరాబాద్ నగరంలో జింజర్ హోటల్ ప్రవేశించింది. మధ్యస్థాయి విభాగంలో తన సరళమైన, విలాసవంతమైన సేవలతో నగరంలో విభిన్నమైన డిమాండ్‌ను అందుకోవడానికి ఈ హోటల్ వ్యూహాత్మకంగా ఏర్పాటు చేయబడింది అన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ రోడ్‌లోని జింజర్ హోటల్లో 118 గదులు ఉన్నాయి. అన్ని రకాల అభిరుచులకు అనుగుణంగా రూపొందించిన జింజర్ సిగ్నేచర్ క్యూమిన్ ఆల్‌డే డైనింగ్ రెస్టారెంట్‌లో అతిథులు భోజనం ఆస్వాదించవచ్చు. ఈ హోటల్‌లో ఫిట్‌నెస్ సెంటర్ మరియు సమావేశాలు, సదస్సులు, సామాజిక కార్యక్రమాలకు అనువుగా విశాలమైన బాంకెట్ సౌకర్యాలు ఉన్నాయన్నారు.

## నిబంధనల ప్రకారమే గృహ నిర్మాణాలు

### గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశాలు



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** అనుపురెడ్డిపల్లి మండలం పెంట్ల గ్రామంలో అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం సమగ్రంగా పరిశీలించారు. గ్రామంలో మొత్తం 46 ఇళ్లకు అనుమతులు మంజూరు కాగా అందులో 13 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని మిగిలిన ఇళ్ల పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని సంబంధిత అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పెంట్ల గ్రామంలో తాటి లక్ష్మి లబ్ధిదారుల ఇళ్లను ప్రత్యక్షంగా సందర్శించి నిర్మాణ నాణ్యత పనుల పురోగతిని సవివరంగా పరిశీలించారు. లబ్ధిదారుతో నేరుగా మాట్లాడి ఇప్పటివరకు జరిగిన వ్యయం ప్రభుత్వం నుండి విడుదలైన నిధులు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ స్వర్ణ, ఎంపీడీవో మహాలక్ష్మి, ఎంపీఓ షబానా, అగ్రికల్చర్ ఆఫీసర్ అనూష తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలి

**దొడ్డి తాతారావు**



**చర్ల మహా :** దుమ్ముగూడెం మండలంలో మే 1వ తేదీన జరగనున్న బీఆర్ఎస్ పార్టీ భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని చర్ల మండల బీఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక పాలన, ప్రజలకు హామీ ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీల అమలులో వైఫల్యాలను ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలి, రాబోయే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఎలా పనిచేయాలనే దిశగా ఈ సమావేశంలో చర్చించి దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు, డివిజన్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానెం రామకృష్ణ తదితరులు హాజరవుతున్నట్లు చెప్పారు. కావున పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయాలని దొడ్డి తాతారావు కోరారు.

## వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని
## విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

**జోనల్ కమిషనర్, సత్యనారాయణ**



**రాజేంద్రనగర్ మహా:** వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జోనల్ కమిషనర్ ఏకే సత్యనారాయణ అన్నారు. జిహెచ్ఎంసి పరిధి చార్మినార్ జోన్ లో విద్యార్థులకు నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని, జోనల్ కమిషనర్ ఏకే సత్యనారాయణ, చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫెఖర్ అలీ, స్పోర్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ మహమ్మద్ కాజా మోయిజ్ లతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులకు సెలవులు ఉండడంతో, విద్యార్థులు క్రీడల పట్ల మంచి నైపుణ్యాన్ని సాధించాలనే సదుద్దేశంతో జోనల్ కమిషనర్, విద్యార్థులకు వేసవి స్పోర్ట్స్ క్యాంపును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ యొక్క స్పోర్ట్స్ శిబిరాన్ని సాద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. శిబిరంలో నిర్వహించిన క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, జోనల్ కమిషనర్ సత్యనారాయణ, చార్మినార్ ఎమ్మెల్యేతో కలిసి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో క్రీడా విభాగం సిబ్బంది, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని
## పరిశీలించిన కలెక్టర్ అంకిత్




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** అన్నపరెడ్డి మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత బుధవారం ఆకస్మికంగా సందర్శించి అక్కడ జరుగుతున్న కొనుగోలు ప్రక్రియను సమగ్రంగా పరిశీలించారు. కేంద్రంలో రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా స్వీకరిస్తున్నారా అనే విషయంపై ప్రత్యేకంగా దృష్టి సారించి సంబంధిత అధికారులను వివిధ అంశాలపై ప్రశ్నించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ధాన్యంలో తేమ శాతాన్ని నిర్ధారించడానికి ఉపయోగిస్తున్న మాయిశ్చరైజింగ్ యంత్రం పనితీరును కలెక్టర్ పరిశీలించారు. తేమ శాతం నిర్ధారణలో ఎలాంటి లోపాలు లేకుండా ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలన్నారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా పరీక్షించి వెంటనే కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని సూచించారు. రైస్ మిల్లులకు ధాన్యం ట్యాగింగ్ విధానం కొనుగోలు రిజిస్టర్ల నిర్వహణ టోకెన్ పంపిణీ వ్యవస్థపై సమగ్ర సమాచారం సేకరించారు. టోకెన్లను సమయానికి జారీ చేసి రైతులు అనవసరంగా వేచి ఉండకుండా చూడాలని ప్రతి రైతుకు పారదర్శకంగా సేవలు అందించాలన్నారు. కొనుగోలు కేంద్రంలో సరైన రికార్డుల నిర్వహణ ఎంతో కీలకమని ప్రతి నమోదు ఖచ్చితంగా ఉండాలని అధికారులకు సూచించారు.ప్రభుత్వం రైతులకు మద్దతుగా చేపట్టిన ధాన్యం కొనుగోలు కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి ప్రతి రైతు లాభపడేలా చూడటం అధికారుల బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు.అనంతరం పెంట్ల గ్రామంలో ఇందిరమ్మ ఇల్లును తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ స్వర్ణ, ఎంపిడిఓ మహాలక్ష్మి, ఎంపీఓ షబానా, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ అనూష తదితరులు పాల్గొన్నారు.

## బాల కార్మికులు అక్రమ రవాణాపై పలు హోటల్స్ లాడ్జిలలో
## ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన చైల్డ్ ప్రొడక్షన్ అధికారి సంతోష్



**రాజేంద్రనగర్,మహా ;** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా డీపీఓ స్వాతి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సంతోష, పోలీస్ శాఖకు చెందిన ఎస్ఐ రాజ్‌కుమార్, సీఓ లక్ష్మణ్ సిబ్బంది సంయుక్తంగా రాజేంద్రనగర్ సర్కిల్లోని అరంఘర్ పిస్తా హౌస్ హోటళ్లు, మరియు లాడ్జ్‌లలో బుధవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. సందర్భంగా హోటల్ సిబ్బంది ఆధార్ కార్డులు వారి వివరాలను పరిశీలించారు. బాల కార్మికలను అక్రమ రవాణా, బాలలపై వేధింపుల నివారణపై హోటల్ యాజమాన్యాలకు అవగాహన కల్పించారు. చిన్నారుల రక్షణకు సంబంధించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అనుమానాస్పద ఘటనలు జరుగుతే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.చిన్నారుల భద్రత, సంక్షేమం కోసం నిరంతరం తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి అక్రిడిటేషన్ కార్డు జారీ..!

- రంగారెడ్డిజిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి
- నూతన మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో సమావేశం
- 252 జీఓకు అనుగుణంగా నియమ నిబంధనలు పాటించాలి




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** నూతన మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో సమావేశమైన జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి. నూతన మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన డిస్ట్రిక్ట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులకు జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని, 252 జీఓకు అనుగుణంగా నియమ, నిబంధనలు పాటించాలని సూచించారు. మీడియా ప్రతినిధులు ప్రజలకు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల సమాచారం చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. అక్రిడిటేషన్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని నియమ నిబంధనలు పాటించాలని, ఎప్పటికప్పుడు కమిటీ సభ్యులతో అన్ని విషయాలు చర్చించి ముందుకు వెళ్లాలని సూచించారు. అనంతరం కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ కు శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. సమావేశంలో డీపీఆర్ఓ బాలేశ్వరి, డిస్ట్రిక్ట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు కె.శ్రీకాంత్ రెడ్డి, శేఖర్ ఉప్పరి, సయ్యద్ ఇక్రముల్లా హుస్సైని, అన్నవరపు శేఖర్ బాబు, మహ్మద్ సిరాజ్, గంజి ప్రదీప్ కుమార్, సిహెచ్.రాంరెడ్డి, ఎం.శ్రీనివాస్, యు.శివ కుమార్, రొయ్యల రాజు, ఏఈఐఈ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

### విధుల్లో నిర్లక్ష్యం వహించిన పంచాయతీ కార్యదర్శికి

## షోకాజు నోటీసులు జారీ....

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మండలంలోని ముచ్చింతల్ గ్రామంలో కొంపోస్ట్ యార్డును రంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్బుధవారం ఆకస్మికంగా సందర్శించారు.గ్రామపంచాయతీ లోని కోంపోస్ట్ యార్డులో ఇంటి నుండి సేకరించిన చెత్తను కాల్చి వేస్తున్నారు. వైకుంటధామంలోని బోర్ మోటార్ నిరంతరంగా నడుస్తుంది.నర్సరీలోని మొక్కలు మొలకెత్తలేవు. గ్రామ పంచాయతీ అధికారి తమ విధులను సక్రమంగా నిర్వర్తించక పోవడంతో పాటు నిర్లక్ష్యం వహించడంతో పంచాయితీ కార్యదర్శి పూర్తి నిర్లక్ష్య ధోరణి వైకరిస్తున్నందుకు షోకాజు నోటీసు జారీ చేశారు. ఈ లోపాలను రెండు రోజులలో సరి చేసుకోవాలని ఆదేశించారు. విషయంలో తమకు



సంబంధం లేన్నట్టుగా వ్యవహరించిన సర్పంచ్ మండల పంచాయితీ అధికారి కి కూడా నోటీసు జారీ చేశారు.

# పదవిపై ధీమా.. కవిత తీరుపై విమర్శలు..

- అధిష్టానం ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుంది కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి..
- యుద్ధ వాతావరణం వల్లే ఇంధన కొరత దీనిని రాజకీయం చేయొద్దు..

**నల్గొండ, మహా :** రాష్ట్రంలో త్వరలో జరగనున్న మంత్రివర్గ విస్తరణపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ మార్గదర్శకత్వంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పార్టీ బలోపేతానికి, ప్రాంతీయ అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నట్లు ఆయన స్పష్టం చేశారు. తనకు



మంత్రి పదవి విషయంలో అధిష్టానం ఇచ్చిన మాటను ఖచ్చితంగా నిలబెట్టుకుంటుందని నాలుగు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల అనంతరం ఈ మేరకు సానుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. మాజీ ముఖ్యమంత్రి కుమార్తె కవిత తీరుపై రాజగోపాల్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేటీఆర్, హరీష్ రావు లేదా కవిత.. వీరందరికీ కేసీఆర్ వల్లే గుర్తింపు వచ్చిందని ఆయన గుర్తు చేశారు. కేవలం కుటుంబంలో నెలకొన్న ఆధిపత్య పోరు వల్లే కవిత బయటకు వచ్చారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన సొంత తండ్రిని మొదటి సమావేశంలోనే విమర్శించడం ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కన్న తండ్రిని గౌరవించలేని వ్యక్తి ప్రజలకు తల్లిగా ఎలా సేవలందిస్తుందని ఆయన ప్రశ్నించారు. లిక్కర్ కుంభకోణం కేసులో కవితకు ఇంకా క్లీన్ చిట్ రాలేదని, ఆ వ్యవహారం కోర్టులో పెండింగ్‌లోనే ఉందన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు. రాష్ట్రాన్ని ఉద్ధరిస్తానని చెప్పే ముందు ఆమె తనపై ఉన్న కేసుల సంగతి చూసుకోవాలని హితవు పలికారు. రాష్ట్రంలో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరతపై స్పందిస్తూ ఇది పూర్తిగా అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావమేనని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాల కారణంగా ఇంధన సరఫరాలో సహజంగానే అడ్డంకులు ఏర్పడుతున్నాయని దీనిని రాజకీయం చేయడం తగదన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నాయని ప్రస్తుత ప్రత్యేక పరిస్థితులను రాజకీయ కోణంలో చూడవద్దని కోరారు. యుద్ధ మేఘాలు తొలగిపోయిన తర్వాత పరిస్థితులు మళ్లీ సాధారణ స్థితికి వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## సాఫీగా మున్సిపల్ సర్వసభ్య సమావేశం

- 16 ఎజెండా అంశాలపై చర్చ
- అభివృద్ధికి సహకరిస్తానన్న ఎంపీ

**ఆదిలాబాద్ మహా:** ఆదిలాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎంపీ నగేశ్ తెలిపారు. బల్దియాలో బుధవారం మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష అధ్యక్షతన సుదీర్ఘంగా జరిగిన సర్వ సభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పలు అంశాలపై చర్చించి అధికారులకు సూచనలు చేసినట్టు తెలిపారు. కేంద్రం ద్వారా అమృత పథకంలో భాగంగా పట్టణ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తామని తెలిపారు. అధికారులు కౌన్సిల్ సభ్యులు సమన్వయంతో పనిచేస్తూ పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.16 అజెండా అంశాలపై చర్చించారు. వార్డుల్లో నెలకొన్న పౌర సమస్యలపై కౌన్సిలర్లు నిలదీయగా, అధికారులు వివరణ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దని, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీ అధికా



రులను ఆదేశించారు.ఆదిలాబాద్ పట్టణ అభివృద్ధికి తగిన విధంగా కృషి చేస్తామని చైర్ పర్సన్ బండారి అనూష తెలిపారు. అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు తదితర అంశాలను అజెండాలో పొందుపరిచి దానికి అనుగుణంగా చర్చించినట్లు . తెలిపారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. అర్హులైన లబ్దిదారులకు సంక్షేమ పథకాల ఫలాలు అందేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. జన గణన స్వీయ నమోదులో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ వివరాలను ఆన్ లైన్ లో పొందుపరచాలని సూచించారు.

## ఉమ్మడి జిల్లాలో మిశ్రమ ఫలితాలు

- నిర్మల్ జిల్లాకు 3వ స్థానం
- 21వ ప్లేస్ లో ఆదిలాబాద్ జిల్లా

**ఆదిలాబాద్ మహా:** నేడు విడుదలైన టెన్త్ ఫలితాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు మిశ్రమ ఫలితాలు వచ్చాయి. నిర్మల్ జిల్లా 98.96 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 3వ స్థానంలో నిలవగా, మంచిర్యాల 97.20 శాతంతో 20వస్థానం , ఆదిలాబాద్ 96.90 శాతంతో 21వ స్థానం , అసిఫాబాద్ 94.16 ఉత్తీర్ణతా శాతంతో 28వ స్థానాల్లో నిలిచాయి. నిర్మల్‌లో 9,743 మంది పరీక్షలు రాసి, 9,642 మంది ఉత్తీర్ణులు కాగా మంచిర్యాలలో 9,684కి 9,413, ఆదిలాబాద్‌లో 10,875కి 10,538 మంది , అసిఫా



బాద్‌లో 6,932కి 6,527 మంది విద్యార్థులు పాస్ అయ్యారు. నాలుగు జిల్లాల్లోనూ బాలికలే అధిక ఉత్తీర్ణతతో ముందంజలో నిలిచారు.జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, ఉపాధ్యాయులను విద్యాశాఖ అధికారులు అభినందించారు.

## ప్రజలకు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయడమే లక్ష్యం

### బెల్లంపల్లి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రామచందర్

**బెల్లంపల్లి మహా:** ప్రజలకు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని బెల్లంపల్లి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రామచందర్ పేర్కొన్నారు.బుధవారం రోజున బెల్లంపల్లి మండలం సోమ గూడెం గ్రామపంచాయతీలో బెల్లంపల్లి శాసన సభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు బెల్లంపల్లి మండలం సోమగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని పలువార్డులలో నీటిఎద్దడి దృష్ట్యా నూతన బోర్‌వెల్ పనులను ఆయన ప్రారంభించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెల్లంపల్లి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, బెల్లంపల్లి మాజీ జెడ్పీటీసీ కారుకూరి రాంచందర్ హాజరై బోర్‌వెల్ పనులను ప్రారంభించి మాట్లాడుతూ గ్రామ ప్రజలకు తాగునీటి సౌకర్యం మెరుగుపర్చే లక్ష్యంతో చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సోమగూడెం సర్పంచ్ పొన్నాలమౌనిక,



సోమగూడెం కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ గోమాస భీమయ్య , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముత్తె భూమయ్య, పొన్నాల రాజు,తోట సురేష్,బెల్లంపల్లి బుగ్గ రాజేశ్వర స్వామి దేవస్థానం డైరెక్టర్ దూడం మహేష్, యూత్ కాంగ్రెస్ బెల్లంపల్లి మండల అధ్యక్షుడు సోమగూడెం 10వ వార్డ్ సభ్యుడు బామల్ల రాకేష్ పాల్గొన్నారు.

## పోచమ్మ తల్లి విగ్రహం ఎదుటన గుప్త నిధుల తవ్వకం

### ... భీమిని లక్ష్మీపూర్ గ్రామాల మధ్యన ఉన్న కమలాపురం ప్రాజెక్టు సమీపంలో

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి నియోజకవర్గం భీమిని మండల పరిధి లోని కమలాపురం ప్రాజెక్టు వద్ద ఉన్న పోచమ్మ తల్లి విగ్రహం ఎదుటన గుప్త నిధుల తవ్వకాలు జరగడం మండలంలో చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళ్తే కమలాపూర్ ప్రాజెక్ట్ ముందు కెనాల్ ఎదుటన పోచమ్మ తల్లి విగ్రహం నకు చాలా ఏళ్ళుగా భీమిని లక్ష్మీపూర్ గ్రామాల ప్రజలు పోచమ్మ తల్లికి పూజలుచేయడం ఆనవాయితీ.అయితే గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి పోచమ్మ తల్లి విగ్రహానికి సమీపంలో గుర్తు తెలియని దుండగులు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపిన ఆనవాళ్లను ఉదయం పంటచేను పనులు నిమిత్తమై చేరుకున్న గ్రామ ప్రజలకు బుధవారం ఉదయం కనిపించడంతో విషయం కాస్త బహిర్గతమైంది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ తమ ఆరాధ్య దైవంగా కొలుస్తున్న పోచమ్మ తల్లి విగ్రహా సమీపంలో గుట్ట నిధుల తవ్వకాలు జరపడం శోచనీయమని ఆగ్రహం వ్యక్తం చేశారు.



కమలాపూర్ ప్రాజెక్టు ఏర్పడడానికి ముందే ప్రాజెక్టులో కమలాపూర్ గ్రామం కాస్త ఉండేదని సంబంధిత గుర్తు తెలియని వ్యక్తులు గుప్తనిధులకోసం ఆలయ సమీపంలో తవ్వకాలు జరిపి అపవిత్రం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సంబంధిత అంశంలో అధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపి దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## అందరికీ సైబర్ క్రైమ్ పై అవగాహన ఉండాలి

### మంచిర్యాల జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్

**మంచిర్యాల, మహా :** అందరికీ సైబర్ క్రైమ్ పై అవగాహన ఉండాలని మంచిర్యాల జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్ అన్నారు. బుధవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నర్సింగ్ కళాశాలలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమావేశానికి ఎస్.ఐ. మధుసూదన్, కళాశాల ప్రిన్సిపల్ కె సుజాత, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆనంద్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. విద్యార్థులు సైబర్ నేరాల రకాలు, రక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆన్లైన్ లో సురక్షి



తంగా ఉండే విధానాలను తెలుసుకొని ఉండాలని అన్నారు. సైబర్ నేరాలకు సంబంధించి అత్యవసర సహాయం కోసం సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నం.1930, పిల్లల సమస్యల కోసం చైల్డ్ హెల్ప్ లైన్ నం.1098 లో సంప్రదించవచ్చని తెలిపారు. విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కాల్స్, సందేశాలు, లింక్ లతో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పశు సంపద సంరక్షణ అందరి బాధ్యత..

- పర్యావరణ సమతుల్యతలో మూగజీవాల పాత్ర కీలకం..
- మే రెండో వారంలో పెంపుడు కుక్కల దత్తత కార్యక్రమం..జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ వెల్లడి

**నల్గొండ, మహా :** నేరుగా ఆదాయాన్ని సృష్టించే పశు సంపదను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ప్రపంచ పశు వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలోని ఉదయాదిత్య భవన్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. పశువుల ద్వారా మనుషులతో పాటు పర్యావరణ సమతుల్యాన్ని కాపాడగలుగుతామని సమాజ అభివృద్ధికి ఇవి ఎంతగానో దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో మాంసం వినియోగం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పశుగ్రాసం, పశువుల నాణ్యత (లైవ్ స్టాక్)పై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో పశు సంతతికి అనుగుణంగా సౌకర్యాలు మెరుగుపరుస్తామని పశు వైద్యశాలలు, సబ్ సెంటర్లలో మౌలిక వసతులు, టాయిలెట్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎక్కడైనా ల్యాబ్‌లు లేదా ఇతర వసతుల అవసరం ఉంటే తక్షణమే ప్రతిపాదనలు పంపాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రమేష్‌ను ఆదేశించారు. జిల్లాలో సుమారు







35 వేలకు పైగా కుక్కల జనాభా ఉందని ప్రస్తుతం ఒకే ఒక ఏబీసీ (యానిమల్ బర్త్ కంట్రోల్) కేంద్రం అందుబాటులో ఉందని కలెక్టర్ తెలిపారు. అన్ని మున్సిపాలిటీల్లో వీటిని ఏర్పాటు చేసేందుకు స్థలాలను సేకరించాలని ఆర్డీవోలను ఆదేశించినట్లు చెప్పారు. అలాగే మే రెండో వారంలో జిల్లాలో పెంపుడు కుక్కల దత్తత కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పశువుల ఇన్సూరెన్స్‌పై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన పశు సంవర్ధక శాఖ ఉద్యోగులకు కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రమేష్, విశ్రాంత అధికారి వెంకటేశ్వర్లు, వివిధ విభాగాల సహాయ సంచాలకులు, పశువైద్యులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

### ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**యాదాద్రి భువనగిరి, మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు బస్ స్టాండ్ ముందు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగామ ఉపేందర్ రెడ్డి ఏర్పాటు చేసిన చలివేంద్రంను బుధవారం ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రారంభించారు ఈ కార్యక్రమంలో బీర్ల పౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత,మున్సిపల్ చైర్మన్ బీజన బాలమణి భాస్కర్,వైస్ చైర్మన్ ఆంజనేయులు,సిఐ యాలాద్రి,పలువురు కౌన్సిలర్లు కాంగ్రెస్



నాయకులు గందమల్ల అశోక్,ఎంఏస్ విజయ్ కుమార్,నీలం వెంకటస్వామి,ఎంఏ ఏజాజ్ పాల్గొన్నారు.

## గొలనుకొండ భక్తికొండ

### ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**ఆలేరు, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా గొలనుకొండ గ్రామంలో బుధవారం ఘనంగా నిర్వహించిన నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన, అభయ ఆంజనేయ స్వామి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య దంపతులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనిత హాజరై ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమం ప్రారంభానికి ముందు, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మరియు వారి కుటుంబ సభ్యులు గ్రామంలోని శ్రీ శంభులింగేశ్వర స్వామి దేవాలయాన్ని దర్శించుకుని, స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నవగ్రహ విగ్రహాలు మరియు అభయ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించి, భక్తులకు దర్శనార్థం అందుబాటులో ఉంచారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. గొలనుకొండ ను భక్తి కొండగా మార్చారన్నారు.ప్రజ



లలో ఐక్యత, శాంతి, సౌభ్రాతృత్వం పెరగాలంటే దేవాలయాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అనంతరం, బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన నూతన అతిథి గృహాన్ని ఆయన ప్రారంభించారు. ఈ అతిథి గృహం గ్రామానికి వచ్చే భక్తులు, సందర్శకులకు సౌకర్యంగా ఉండేలా నిర్మించబడిందని తెలిపారు. గ్రామ అభివృద్ధికి బీర్ల ఫౌండేషన్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలు నివారించాలి

**యాదాద్రి భువనగిరి, మహా:** జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించడం, విలువైన ప్రాణాలను కాపాడటానికి పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులకు సూచించారు.బుధవారం రోజు కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్, అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ, ట్రాఫిక్ డిఎస్పీ ప్రభాకర్ రెడ్డి,జిల్లా స్థాయి అధికారులు, జాతీయ రహదారుల అధికారులు, ఇంజనీరింగ్, రవాణా అధికారులు ఈ సమీక్షా సమావేశం పాల్గొన్నారు..ఈ సందర్భంగా కలెక్టర్ అంనురాంగ్ జయంతి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో రహదారి భద్రతా చర్యలు కీలకమైనవని అన్నారు. ఈ చర్యలను తీసుకోవడంలో అన్ని శాఖల మధ్య సమన్వయం అవసరమని, ప్రతి శాఖ సమిష్టిగా పని చేయాలని సూచించారు. మానవ తప్పిదాలు, వాహనాలు, అత్యధిక వేగం వలన రోడ్డు ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. రోడ్లపై రుంబుల్ స్ట్రిప్స్, స్టడ్స్,స్పీడ్ లిమిట్ ,సూచిక బోర్డులు, బ్లింకర్స్ వంటివి ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు అన్ని శాఖల మధ్య సమన్వయంతో జిల్లా



లో రోడ్డు ప్రమాదాలు సంభవించకుండ పటిష్టంగా ఏర్పాట్లు చేయాలన్నారు. అధిక వేగం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, వేగ పరిమితిని ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు సీటు బెల్టు, హెల్మెట్ ధరించే విధంగా చూడాలన్నారు. విజయవాడ, వరంగల్ హైవే పై ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ మాట్లడుతూ అవసరం ఉన్నచోట స్పీడ్ లిమిట్ బోర్డ్స్, లైటింగ్, భారికేడింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, ఆర్ అండ్ బి అధికారి సరిత, ట్రాన్స్పోర్ట్ అధికారి సాయి కృష్ణా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలపై గట్టి నిఘా

**యాదాద్రి భువనగిరి, మహా:** మాదకద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగంపై గట్టి నిఘా పెట్టాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.బుధవారం మినీ మీటింగ్ హాల్ లో NCORD (నార్కోటిక్స్ కోఆర్డినేషన్) సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ , అడిషనల్ ఎస్పి లక్ష్మీనారాయణ తో కలిసి సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డ్రగ్స్‌కు సంబంధించిన అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. యువతను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఇంటర్మీడియట్ కళాశాలలు మరియు క్రీడా పోటీల వద్ద ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. విద్యార్థులను దుష్ప్రవర్తనల నుండి దూరంగా ఉంచేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.గ్రామ మరియు వార్డు స్థాయిలో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్ కమిటీలు సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, వాటి కార్యకలాపాలను క్రమం తప్పకుండా సమీక్షించాలని సూచించారు. అలాగే ఇంటర్మీడియట్ కళాశాలల్లో డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక క్యాలెండర్ రూపొందించి, దాని ప్రకారం కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు.జిల్లా విద్యా అధికారి (DEO) విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాల



ని, విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక నష్టాలను వివరించాలని ఆదేశించారు. అదే విధంగా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ డ్రగ్స్ సరఫరా, నిల్వ మరియు వినియోగంపై కఠిన తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలో అన్ని సంబంధిత శాఖలు పరస్పర సహకారంతో పనిచేసి డ్రగ్స్ సమస్యను పూర్తిగా నిర్మూలించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ మాట్లాడుతూ కాలేజీ,ఫ్యాక్టరీ, గ్రామాలలో డ్రగ్స్ పై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. యువత డ్రగ్స్ కి అలవాటు పడకుండా చూడాలన్నారు.ప్రజల్లో అవగాహన పెంపు ద్వారా డ్రగ్స్ వినియోగాన్ని తగ్గించవచ్చని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.ఈ సమావేశంలో ఎక్సైజ్ సూపర్నెంట్ విష్ణుమూర్తి, డీఈవో సత్యనారాయణ, జిల్లా ట్రాన్స్పోర్ట్ అధికారి సాయి కృష్ణ, జిల్లా వైద్యాధికారి మనోహర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్ సిలో టాఫర్ గా నిలిచిన అరుణ్ కుమార్

**యాదాద్రి భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని శ్రీ గౌతమ్ హైస్కూల్ విద్యార్థి కొంపెల్లి అరుణ్ కుమార్ SSC పరీక్షలో 600 లకు 563 మార్కులు సాధించి స్కూల్ టాపర్ గా నిలిచారు ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ & ప్రిన్సిపాల్ డాక్టర్ మిర్యాల దుర్గ ప్రసాద్ తోపాటు యాకూబ్,మల్లేష్,జోసేప్, జయచిత్ర,సుమా,ఉమా టీచర్లు శాలువా కప్పి కేక్ కట్ చేసి ఘనంగా సన్మా



నించారు.అరుణ్ ను ,ఆయన తల్లిదండ్రులు కొంపెల్లి ఝాన్సీ దాస్లను అభినందించారు.

## మే 3న నల్గొండ ప్రోమో రన్..

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న జిల్లా కలెక్టర్..
- మాదకద్రవ్యాల వ్యతిరేక చైతన్యమే లక్ష్యం..
- తెలంగాణ రన్ సొసైటీ ప్రధాన కార్యదర్శి మగ్గారి శ్రీనివాస్..

**నల్గొండ, మహా :** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, సమాజంలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా చైతన్యం కల్పించేందుకు మే 3వ తేదీన నల్గొండ పట్టణంలో 'ప్రోమో రన్' నిర్వహిస్తున్నట్లు సొసైటీ ఫర్ తెలంగాణ రన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మగ్గారి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన సొసైటీ ఈసీ మెంబర్ రాఘవ్, జిల్లా వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధి బండారు ప్రసాద్, డాక్టర్ పుల్లారావులతో కలిసి జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్‌ను ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మే 3న నిర్వహించే పరుగు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని కలెక్టర్‌ను కోరుతూ ఆహ్వాన పత్రం అందజేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పది జిల్లాల్లో తెలంగాణ రన్ పేరుతో 2కె, 5కె పరుగులను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. యువతను మాదకద్ర







వ్యాల బారి నుంచి రక్షించడం మరియు తెలంగాణ రాష్ట్ర అస్తిత్వాన్ని చాటిచెప్పడమే ఈ రన్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. మే 3వ తేదీ ఆదివారం ఉదయం 6 గంటలకు స్థానిక ఎన్జీ కళాశాల ప్రాంగణం నుండి ఈ పరుగు ప్రారంభమవుతుందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ దీనిని జెండా ఊపి ప్రారంభిస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

### భారత్ మీడియాపాయింట్ ఆధ్వర్యంలో

## జూన్ 2న తెలంగాణ రైజింగ్ అవార్డ్స్ -2026

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్రం సిద్ధించి పుష్కర కాలం దాటుతున్న వేళ, రాష్ట్ర పునర్నిర్మాణంలో పాలు పంచుకున్న ధీశాలురను గౌరవించుకునేందుకు భారత్ మీడియా పాయింట్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యంతో "తెలంగాణ రైజింగ్ అవార్డ్స్ - 2026" వేడుకను జూన్ 2వ తేదీన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 2014 నుండి 2026 వరకు రాష్ట్ర పునర్నిర్మాణ తొలి దశలో, తెలంగాణ అభివృద్ధికి గట్టి పునాది వేసిన వ్యక్తులు, సంస్థలు మరియు వివిధ రంగాల్లో తమదైన ముద్ర వేసిన నాయకత్వాన్ని ఈ వేదికపై సత్కరించనున్నారు. కేవలం అధికారిక కార్యక్రమంగా కాకుండా, రాష్ట్రం పట్ల ఉన్న నిబద్ధతను, మేధస్సును గుర్తించే బాధ్యతాయుతమైన వేడుకగా దీనిని రూపొందించారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరించుకోవడం. ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా అమరవీరుల కుటుంబాలను గౌరవించడం ఈ వేదికపై అత్యంత ఉద్వేగభరితమైన మరియు గౌరవప్రదమైన ఘట్టం కానుందని నిర్వాహకులు తెలిపారు. భారత్ మీడియా పాయింట్ సమర్పణలో జరగనున్న ఈ మహత్తర వేడుక, జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు సరికొత్త శోభను తీసుకురానుందని తెలిపారు.





# స్టార్ హీరో కుమారుడితో పూజా హెగ్డే డేటింగ్.. కన్ఫామ్ అంటూ పోస్ట్

ప్రముఖ నటి పూజా హెగ్డే ప్రేమలో ఉన్నారనే కథనాలు మరోసారి వైరల్ అవుతున్నాయి. బాలీవుడ్ నటుడు రోహన్ మెహ్రా (దివంగత నటుడు వినోద్ మెహ్రా కుమారుడు)తో ఆమె డేటింగ్ చేస్తోందనే వార్తలు కొంత కాలంగా వస్తున్న విషయం తెలిసిందే. అయితే, తాజాగా ప్రముఖ ఎంటర్‌టైన్‌మెంట్ మ్యాగజైన్ ఫిల్మ్‌ఫేర్ సంస్థ సోషల్‌మీడియాలో ఒక పోస్ట్ చేసింది. రోహన్ మెహ్రాతో పూజా హెగ్డే ప్రేమలో ఉన్నారనే వార్త నిజమేనంటూ తమ వద్ద సరైన ఆధారం కూడా ఉందని ఆ సంస్థ పేర్కొంది. పూజా హెగ్డే, రోహన్ మెహ్రా తరుచుగా పలుమార్లు కలిసి కనిపించిన సందర్భాలు ఉన్నాయి. వారిద్దరూ ప్రేమలో ఉన్నారంటూ చాలా రోజులుగా వార్తలు వస్తూనే ఉన్నాయి. అయితే, ఇంతకాలం అది కేవలం రూమర్‌గానే ఉండేది. కానీ, ఫిల్మ్‌ఫేర్ లాంటి సంస్థ ఈ వార్తను ప్రచురించడంతో దాదాపు నిజమే ఉంటుందని నెటిజన్లు అంటున్నారు. అయితే , ఈ అంశం గురించి వారిద్దరూ ఇంకా స్పందించలేదు. రోహన్ మెహ్రా (Rohan Mehra) 2018లో 'బజార్' (Baazaar) చిత్రంతో బాలీవుడ్‌లో అడుగుపెట్టాడు. ఆ తర్వాత 420 IPC, అద్భుత్ వంటి చిత్రాలతో పాటు, కాళ (Kaala) వంటి వెబ్ సిరీస్‌లలో నటించి గుర్తింపు పొందారు.



# నెలకు నా ఖర్చు ఎన్ని లక్షలు అంటే..: నిధి అగర్వాల్

నిధి అగర్వాల్ పాన్ ఇండియా కథానాయకిగా రాణిస్తున్నారు. అయితే నటిగా దశాబ్దానికి చేరువు అవుతున్నా..ఇప్పటికీ సరైన గుర్తింపు కోసం పోరాడుతూనే ఉన్నారని చెప్పక తప్పదు . అదే సమయంలో వాణిజ్య ప్రకటనల్లో నటిస్తూ బాగానే సంపాందిస్తున్నా, ఐరన్‌లెగ్ అనే ముద్ర నుంచి ఇంకా బయట పడలేదు. ఇక ప్రేమ వ్యవహారంలోనూ బాగానే వార్తల్లో ఉంటున్నారు. ఆ మధ్య నటుడు శింబుతో ప్రేమాయణం అంటూ ప్రచారం వైరల్ అయ్యింది. అప్పడామె ఆయనకు జంటగా ఈశ్వర్ అనే చిత్రంలో నటించారు. ఈ చిత్రం సక్సెస్ కాకపోయినా, ప్రేయాయణం వార్తలతో బాగానే పాపులర్ అయ్యారు. తెలుగుతో పాటు కోలీవుడ్‌లో ఈ బ్యూటీ పలు సినిమాల్లో నటిస్తూనే ఉన్నారు. జయంరవికి జంటగా భూమి చిత్రంలో నటించారు. కానీ, ఆ చిత్రం నేరుగా ఓటీటీలో స్ట్రీమింగ్ అవ్వడంతో నిధి అగర్వాల్ కెరీర్‌కు ఏ మాత్రం ఉపయోగ పడలేదు. ఆ మధ్య తెలుగులో పవన్ కల్యాణ్‌కు జంటగా నటించిన హరిహర వీరమల్లు చిత్రంపై చాలా ఆశలు పెట్టుకున్నారు. ఎంతో కష్టపడి ప్రమోషన్స్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అది కూడా పూర్తిగా నీరుగార్చింది. ఇటీవల ప్రభాస్ హీరోగా నటించిన రాజాసాబ్ చిత్రంలో ముగ్గురు హీరోయిన్లలో ఒకరిగా నటించారు. అదీ ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో తన వ్యక్తిగత నెల ఖర్చు గురించి ఒక భేటీలో నిధిఅగర్వాల్ పేర్కొన్నారు. అందులో ' నా నెల ఖర్చు ఎంతో తెలుసా ? అంటూ చెప్పడం ప్రారంభించారు. నా నెలవారి ఖర్చు రూ. 5 లక్షలు అని పేర్కొన్నారు. నా ట్రావెలింగ్, బస,డయిట్,జిమ్, ట్రైనర్, పార్లర్ ఖర్చులకే రూ. 5 లక్షలు అవుతుంది. ఇవి కాకుండా మేకప్, హెయిర్‌స్టైలింగ్, ఫోటోస్ వంటి ఖర్చులను కొన్ని సార్లు కార్యక్రమాల నిర్వాహకులు చెల్లించినా, కొన్ని సార్లు నేను భరించాల్సి ఉంటుంది' అని నటి నిధి అగర్వాల్ పేర్కొన్నారు.



# రూ. 20 కోట్ల విల్లా నాది కాదు..: యాంకర్ స్రవంతి

యూట్యూబ్ యాంకర్‌గా కెరీర్ ప్రారంభించిన స్రవంతి చొక్కారపు.. తన చురుకైన మాటలు, అందంతో బుల్లితెరపై గుర్తింపు తెచ్చుకుంది. బిగ్‌బాస్, యాంకర్, నటి, ఇలా పలు రంగాల్లో దూసుకుపోతూ సోషల్ మీడియాలో తరుచుగా ట్రెండింగ్‌లో నిలుస్తోంది. యాంకర్ సుమ, అనసూయ, శ్రీముఖిల మాదిరిగానే తనకంటూ ఒక ప్రత్యేక శైలిని క్రియేట్ చేసుకుని ప్రేక్షకులను మెప్పిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లోని కదిరికి చెందిన స్రవంతి మధ్యతరగతి అమ్మాయే.. కానీ, ఇండస్ట్రీలోకి వచ్చిన తర్వాత ఆమె భారీగా సంపాధిస్తుందని, రూ. 20 కోట్లతో హైదరాబాద్‌లో ఒక లగ్జరీ ఇల్లు కూడా కొనేసిందని వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో తాజాగా ఆమె క్లారిటీ ఇచ్చింది. గోదారి గట్టుపైన సినిమా కార్యక్రమంలో యాంకర్ స్రవంతిని నటుడు సుదర్శన్ ఒక ప్రశ్న అడిగారు. 'మీకు రూ. 20 కోట్ల విల్లా ఉందని వార్తలు వస్తున్నాయి నిజమేనా..?' అన్నారు. అందుకు ఆమె కూడా చిరునవ్వుతో సమాధానం ఇచ్చింది. తనకు లగ్జరీ విల్లా ఉందనే విషయం కేవలం రూమర్ మాత్రమేనని క్లారిటీ ఇచ్చింది. కొందరు ఇలాంటి ప్రచారాలు చేయడం సహజమేనని ఆమె చెప్పింది. భవిష్యత్‌లో మంచి ఇల్లు కొనాలనే ఆకాంక్ష అందరికీ ఉంటుందని ఆమె తెలిపింది. పుష్ప 1 రిలీజ్ సమయంలో రాయలసీమ స్లాంగ్‌తో అల్లు అర్జున్ ఇంటర్వ్యూ చేసి స్రవంతి పాపులర్ అయింది. అలా ఆమె కెరీర్ ఒక్కసారిగా మారిపోయింది. సున్నా నుంచి మొదలు పెట్టిన స్రవంతి ప్రయాణం ఎన్నో కష్టాలను దాటుకుని మంచి స్థానానికి చేరుకుందని తన గురించి తెలిసిన వారు బహిరంగంగానే చెబుతుంటారు. యాంకర్ స్రవంతి ఆర్థిక స్థితిపై ఇటీవల ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. నేటి ప్రముఖ యాంకర్లు, డిజిటల్ ఇన్‌ఫ్లూయెన్సర్లందరూ కూడా సినీ నటులతో సమానంగా సంపాదిస్తున్నారనే అభిప్రాయానికి నెటిజన్లు రావడమే ఇలాంటి రూమర్స్‌కు కారణమని చెప్పవచ్చు. ఆపై యాంకర్లు తరచుగా ప్రయాణాలు చేస్తూ, ఆన్‌లైన్‌లో ఆడంబరమైన జీవితాన్ని ప్రదర్శించడం వల్లే ఇలాంటి అభిప్రాయానికి కారణం అవుతుంది. అసలు వాస్తవం మరోలా ఉంటుందని పలు సందర్భాల్లో వారు చెప్పిన విషయం తెలిసిందే. తమ కాస్ట్యూమ్స్, మేకప్ ఖర్చులకే సగం రెమ్యునరేషన్ పోతుందని చాలామంది చెబుతుంటారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com